Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను
ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly
సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సాహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణాలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను
వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సీ ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు
అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 234 | హైదరాబాద్ | మంగళవారం 07 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## మిలిటెంట్ల ఘాతుకం

### మణిపూర్‌లో పేలిన ఐఈడీ
### ఇద్దరు జవాన్లు మృతి

ఇంఫాల్, జూలై 6: మణిపూర్‌లో గుర్తుతెలియని మిలింటెంట్ గ్రూప్ ఘాతుకానికి పాల్పడింది. ఉఖ్రుల్ జిల్లాలోని నుంగ్‌షాంగ్ కాంగ్‌లో సోమవారం రాత్రి ఐఈడీ పేలి అస్సాం రైఫిల్స్‌కు చెందిన ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. పలువురు జవాన్లు గాయాల పాలయ్యారు. మృతులను వారెంట్ ఆఫీసర్ బల్వంత్ సింగ్, రైఫిల్‌మెన్ సీయామ్ సింగ్‌గా అక్కడి అధికారులు గుర్తించారు. భద్రతా బలగాలను టార్గెట్ చేస్తూ మిలిటెంట్ గ్రూప్ ఒక వంతెన వద్ద ఐఈడీ అమర్చిందని, భద్రతా దళాల వాహనాలు వంతెన గుండా వెళ్తున్న క్రమంలో ఐఈడీ పేలింది. ఘటన తర్వాత ఇరువర్గాల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. దాదాపు గంటపాటు భీకర పోరు

- మిగతా 2వ పేజీలో



# మహానగర పాలనలో మార్పు

## సీఎం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

- 70 ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి స్వస్తి
- కొత్తగా కోర్ అర్బన్ రీజియన్ బిల్లు
- కొత్త చట్టంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట
- విపత్తుల నివారణకు ప్రత్యేక వ్యవస్థలు
- ఆ తర్వాత అమలు చేయాలని యోచన

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

విశ్వనగరంగా పేరున్న హైదరాబాద్‌లో జీవన ప్రమాణాలకు తగ్గట్లుగా పాలన ఉండటం లేదని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం భావిస్తోంది. జీహెచ్ఎంసీని మూడుగా విభజించిన ప్రభుత్వం హైదరాబాద్ మహానగర పాలనలో మార్పులు తీసుకువస్తోంది. ఈ క్రమంలో 70ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి స్వస్తి చెప్పబోతోంది. మూడు కార్పొరేషన్లు (జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) కలిపి కొత్త చట్టాన్ని తీసుకువస్తోంది. ఈ మేరకు కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) ముసాయిదా బిల్లు (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) -2026ను రూపొందించింది.



**పెరగనున్న ఆదాయం**

కోర్ అర్బన్ రీజియన్ బిల్లు అమల్లోకి వస్తే హైదరాబాద్ పరిధిలోని ఆస్తి పన్ను ఆదాయం పెరగనుంది. ప్రస్తుతం అమలులో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి బదులుగా, ఆస్తి మూలధన విలువ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్‌ను నిర్ణయించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతేకాక.. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం

- మిగతా 2వ పేజీలో

## ఢిల్లీకి రేవంత్ హమాలీ



- కాంగ్రెస్ పెద్దలకు సీఎం డబ్బు సంచుల మోత
- రాష్ట్ర ప్రయోజనాలు విస్మరణ
- హమాలీలు మాత్రం వడ్లు మోస్తూ ప్రజాసేవ
- బీఆర్ఎస్‌ను బద్నాం చేయడానికే..
- కాళేశ్వరం పంపులు బంద్
- సన్నాల బోనస్ ఎగ్గొట్టే కుట్ర
- రెండేళ్లలో మళ్లీ కేసీఆరే సీఎం
- హమాలీల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం
- 18వ హమాలీ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ మహాసభలో కేటీఆర్

- 2లో



## దుబాయ్ భారత కాన్సులేట్‌లోకి ఇక నేరుగా నో ఎంట్రీ!

దుబాయ్‌లోని భారత కాన్సులేట్ పాస్‌పోర్ట్, వీసా, అటెస్టేషన్ తదితర కాన్సులర్ సేవల కోసం వాక్-ఇన్ ప్రవేశాన్ని నిలిపివేసింది. ఇకపై ముందస్తుగా ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్ బుక్ చేసుకున్నవారికే కాన్సులేట్‌లో ప్రవేశం కల్పించనున్నట్లు కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. కొత్తగా ప్రారంభించిన ఎశీశీఎ.జుఖం౦౦-జూశీతీఅఅనఋఋవ.ఏశీఎ పోర్టల్ ద్వారా ధ్రువీకరించిన అపాయింట్‌మెంట్ తప్పనిసరిగా ఉండాలి. అబుదాబిలోని భారత రాయబార కార్యాలయంలో మాత్రం పరిమిత స్థాయిలో వాక్-ఇన్ సేవలు కొనసాగుతాయి. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ఇటీవల దరఖాస్తుదారుల సంఖ్య భారీగా పెరగడంతో సేవలను క్రమబద్ధీకరించేందుకు ఈ మార్పులు

- మిగతా 2వ పేజీలో



## ఆర్థిక సవాళ్లు

### మెట్రో ఫేజ్ 24 వేల కోట్లకు పైగా అవసరం.. ప్రహసనంగా నిధుల సమీకరణ
### ఎస్బీఐ క్యాప్స్ అధ్యయనంపైనే అందరి దృష్టి.. కేంద్ర సహకారమే కీలకం
### నివేదిక తర్వాతనే రుణాల లభ్యతపై స్పష్టత

హైదరాబాద్, జూలై 6: హైదరాబాద్ మెట్రో ఫేజ్-విస్తరణ ప్రాజెక్టు ఇప్పుడు నిర్మాణ దశ కంటే ముందుగా ఆర్థిక సమీకరణ దశలోనే కీలక మలుపు తిరుగుతోంది. నగర భవిష్యత్ రవాణా అవసరాలను తీర్చే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులోని ఫేజ్ భాగంగా చేపట్టే 76.4 కిలో మీటర్ల విస్తరణకు గానూ అంచనా వ్యయం రూ. 24 వేల కోట్లకు పైగా ఉండటంతో, అంత పెద్ద మొత్తాన్ని ఎలా సమీకరించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా మారింది. ప్రస్తుతం తెలం గాణ ప్రభుత్వం ఒకే వనరుపై ఆధారపడకుండా బహుళ ఆర్థిక వనరులను వినియోగించడం వంటి వ్యూహాన్ని అనుసరిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీ, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల రుణాలు, దేశీయ బ్యాంకుల రుణాలు, మెట్రో అనుబంధ వాణిజ్య ఆదాయాలు, భూముల అభివృద్ధి ద్వారా వచ్చే ఆదాయాలను కలిపి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే ప్రణాళిక రూపొందుతోంది. అయితే ఈ ఆర్థిక నమూనా ఎంత వరకు ఆచరణ

- మిగతా 2వ పేజీలో

## రెండేళ్లలో ఎస్ఎల్ బీసీ

### ప్రాజెక్టు పూర్తయితే 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు
### ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు తాగునీటి భరోసా.. కార్మికుల భద్రత
### టన్నెల్, రిజర్వాయర్లు, కాలువల పనులు సమాంతరంగా పూర్తి
### మూడింతలు ఎక్కువగా సిబ్బంది: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 6 : దక్షిణ తెలంగాణ రైతుల దశా బ్దాల కల అయిన ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఏఎంఆర్-ఎస్ఎల్బీసీ) ప్రాజెక్టును జూన్ నాటి కి తప్పకుండా పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్ప ష్టం చేశారు. అదే సమయంలో టన్నెల్ పనుల్లో పాల్గొంటున్న కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని ఆయన తేల్చిచెప్పారు. సోమవారం సచివాలయంలో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన మంత్రి.. ఈ ప్రాజెక్టు కేవలం ఇంజినీరింగ్ నిర్మాణం మాత్రమే కాదని, దక్షిణ తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షకు రూపం ఇవ్వడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం అవసరమైన నిధు లు, భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అనుమతులను వేగంగా

- మిగతా 2వ పేజీలో



## శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్

- తాత్కాలికంగా బాధ్యతల అప్పగింత
- చంపత్‌రాయ్, అనిల్‌మిశ్రా రాజీనామాలకు ఆమోదం
- ట్రస్ట్ అత్యవసర సమావేశంలో నిర్ణయం
- నిధుల దుర్వినియోగంపై ట్రస్ట్ విచారం
- 22న ట్రస్ట్ తదుపరి సమావేశం

లక్నో, జూలై6: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తాత్కాలిక ప్రధానకార్యదర్శిగా కృష్ణమోహన్ నియమితులయ్యారు. అయోధ్య రామ్‌మందిర విరాళాల చోరీ అంశంపై సోమవారం మధ్యాహ్నం

- మిగతా 2వ పేజీలో



## బీఆర్ఎస్, కాంగ్రెస్ నాటకాలు

- కాళేశ్వరం అవినీతిపై రేవంత్‌రెడ్డికి హఠాత్తుగా మమకారం ఎందుకో?
- ఫాతిమా విద్యాసంస్థలపై చర్యలేవి?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్, జూలై 6: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై అటు కాంగ్రెస్ ప్రభుత్వం, ఇటు బీఆర్ఎస్ పార్టీ నాటకాలు ఆడుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

- మిగతా 2వ పేజీలో

## ఐటీ పార్క్ వద్ద డంప్ యార్డా?



- కాలుష్యం, రోగాలను ఇవ్వడమే ప్రజాపాలనా?
- సిద్ధాపూర్ జీవోను ఉపసంహరించుకోవాలి
- బాధిత రైతుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమిస్తుంది
- మాజీమంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 6: రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో ఐటీ పార్క్ నిర్మించాల్సిన చోట డం ప్ యార్డు ఏర్పాటు చేస్తారా అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన చోట కాలుష్యాన్ని, రోగాలను ఇవ్వడమే ప్రజాపాలనా? అని నిలదీశారు. ఇక పక్క చెరువు ఉందని, మరోపక్క దర్గా ఉందన్నారు. దీం తో ఇటు రైతులు, ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడతారని, మరోపక్క వ్యవసా యం సర్వనాశనం అవుతుందని అన్నారు. సిద్ధాపూర్ డంప్ యార్డు జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేకుం టే బాధిత రైతుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమిస్తుందని హెచ్చరించారు. డంప్ యార్డ్ ఏర్పా టు నిర్ణయంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న స్థానిక రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హైదరాబాద్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. డంప్ యార్డు వల్ల తాము ఏ విధంగా నష్టపోతున్నామో వివరిస్తూ ఆయన ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మాజీమంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ... ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రా మంలో 86 ఎకరాల్లో డంప్ యార్డు ఏర్పా టు చేస్తూ కాంగ్రెస్

- మిగతా 2వ పేజీలో

# ఐటీ పార్క్ వద్ద డంప్ యార్డా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం జీవో నం.641 తీసుకురావడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. పచ్చని వ్యవసాయ భూ ముల మధ్య, జనావాసాలకు సమీపంలో డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకోవడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలకు నిదర్శనమని విమర్శించారు. ఈ నిర్ణ యాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సిద్ధాపూర్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న దాదాపు 20 గ్రామాలు ఈ డంప్ యార్డు వల్ల తీవ్రంగా నష్టపోతాయని, వ్యవసాయం సమాధి అవుతుందన్నారు. డంప్ యార్డు ఏర్పాటు చేయాలనుకుంటున్న స్థలానికి ఆనుకుని ఉన్న 'గుట్ట చెరువు' నీటితోనే ఈ ప్రాంత రైతులు వ్యవసాయం చేస్తూ కూ రగాయలు పండిస్తున్నారని పేర్కొన్నారు. ఇ ప్పుడు ఆ చెరువు పక్కనే డంప్ యార్డు పెడి తే ఆ నీరు పూర్తిగా కలుషితమై, సాగు నీటి తో పాటు తాగునీటికీ తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు. అంతేకాకుండా ఎంతో ప్రసిద్ధి చెందిన జహంగీర్ పీర్ దర్గా కూడా ఇక్కడే ఉండటంతో, ఆ కాలుష్యం స్థానికులతో పాటు భక్తులకు కూడా శాపంగా మారడం ఖాయమని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇదే ప్రాంతంలో, డం ప్ యార్డుకు కేటాయించిన సర్వే నంబర్లు 252, 278, 361లో ఉన్న 334 ఎకరాల్లో ఐటీ పార్క్ నిర్మించాలని 'మేము ప్రణాళికలు రూపొందించాం. ఇక్కడ ఐటీ పార్క్ వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది' అని బీఆర్ఎస్ సంకల్పించిందని గుర్తు చేశారు. కానీ, ఉపాధి కల్పించాల్సి న భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వం డంప్ యార్డు ఏర్పాటు చేసి, స్థానిక ప్రజల బతుకులను చిదిమేయాలని చూడటం శోచనీ యమన్నారు. యువతకు అవకాశాలు కల్పించాల్సిన చోట కాలుష్యాన్ని, రోగాలను ఇవ్వడమే ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిద్ధాపూర్ డంప్ యార్డు నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవా లని, లేనిపక్షంలో నష్టపోతున్న ఆ 20 గ్రామాల ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని, స్థానిక రైతులకు అండగా నిలబడి పోరాడుతుందని హరీశ్‌రావు హెచ్చరించారు.

# మిలిటెంట్ల ఘాతుకం

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగింది. ఈ క్రమంలో భద్రతా దళాలు ఇదే ప్రాంతంలో మరో ఐఈడీని నిర్వీర్యం చేశాయి. మిలిటెంట్ల ఘాతుకాన్ని వేర్వేరుగా గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, హోం మంత్రి గోవిందాస్ కొంతౌజం ఖండించారు. ఘాతుకానికి పాల్పడిన మిలిటెంట్ గ్రూప్‌ను తుదముట్టిస్తామని భీషణ ప్రతిజ్ఞ చేశారు.

## దుబాయ్ భారత కాన్సులేట్‌లోకి

# ఇక నేరుగా నో ఎంట్రీ!

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అపాయింట్‌మెంట్ స్లాట్లు ప్రతి రోజు రాత్రి 8 గంటలకు విడుదల చేయబడతాయి. అవి తదుపరి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య సేవల కోసం చెల్లుబాటు అవుతాయి. అపాయింట్‌మెంట్ సమయానికి 15 నిమిషాల కంటే ముందుగా ప్రవేశం ఉండదని కాన్సులేట్ స్పష్టం చేసింది. రద్దీని తగ్గించేందుకు సాధారణంగా దరఖాస్తుదారులకే ప్రవేశం ఉంటుంది. అయితే ఇద్దరు తల్లిదండ్రులు హాజరు కావాల్సిన మైనర్ పిల్లల దరఖాస్తుల విషయంలో మినహాయింపు ఉంటుంది. దుబాయ్ కాన్సులేట్‌లో ప్రవేశం గేట్ నంబర్-1 ద్వారా కల్పించనున్నారు. నవజాత శిశువుల పాస్‌పోర్ట్ దరఖాస్తులు, అలాగే అత్యవసర ప్రయాణ పత్రం (ఎమర్జెన్సీ సర్టిఫికేట్) కోసం వచ్చే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తుదారులు పూర్తిగా నింపిన ఫారమ్‌లు, అవసరమైన పత్రాలు, స్పష్టమైన ఫోటోలు, సంతకాలు/బొటనవేలు ముద్రలను ముందుగానే అప్‌లోడ్ చేసి రావాలని సూచించారు. పాస్‌పోర్ట్ దరఖాస్తులు అధికారిక పోర్టల్‌లో సమర్పించవచ్చు. మరోవైపు, జూలై 1, 2026 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పాస్‌పోర్ట్ ఫీజు నిర్మాణాన్ని కూడా కాన్సులేట్ గుర్తుచేసింది. ప్రస్తుతం వర్తించే ఫీజులు నగదు రూపంలో మాత్రమే స్వీకరిస్తున్నందున ఖచ్చితమైన చిల్లరతో రావాలని దరఖాస్తుదారులకు సూచించింది.

# శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్

(మొదటి పేజీ తరువాయి)

ఆలయ ప్రాంగణంలో ట్రస్ట్ అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్‌దాస్ అధ్యక్షతన నిర్వహించిన అత్యవసర సమావేశంలో సభ్యులు ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే, ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామాలనూ ఆమోదించారు. ట్రస్ట్ తదుపరి సమావేశాన్ని ఈనెల 22న నిర్వహిస్తామని ప్రకటించారు. అనంతరం ఆలయ విరాళాల చోరీపై ట్రస్ట్ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. విరాళాల చోరీ ఆలయంతో పాటు ట్రస్ట్ ప్రతిష్ఠను దెబ్బతీసిందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. వివాదం కారణంగా ఆలయ నిర్వహణపై భక్తుల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ నిర్వహణ, పరిపాలనా వ్యవస్థలో లోపాలు ఉన్నాయని, ఆ విషయాన్ని ట్రస్ట్ అంగీకరిస్తున్నదని ప్రకటించారు. లోపాలను సకాలంలో సరిదిద్దలేకపోయినందుకు చింతిస్తున్నామని తెలిపారు. యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) దర్యాప్తుపై తమకు సంపూర్ణమైన విశ్వాసం ఉందని, భవిష్యత్తులో చోరీ ఘటనలు పునరావృతం కాకుండా భద్రతాపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### నమ్మకస్తుడు కృష్ణమోహన్

ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణమోహన్ తాత్కాలిక నియామకం వెనుక బలమైన కారణం ఉంది. విరాళాల చోరీ తర్వాత ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కృష్ణమోహన్‌కు మొదటి నుంచి నిజాయతీగల వ్యక్తిగా పేరుండటంతోనే ట్రస్ట్ ఈ నిర్ణయం తీసుకున్నదని తెలిసింది. మరోవైపు, చంపత్ రాయ్, అనిల్ మిశ్రా రాజీనామాలను ఆమోదించిన ట్రస్ట్, ఇక వారి స్థానాల్లో కొత్తవారిని నియమించేందుకు కసరత్తు చేస్తున్నది.

# మహానగర పాలనలో మార్పు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించే మార్కెట్ విలువను ఆధారంగా తీసుకొని స్థలాలు, భవనాలపై ఆస్తిపన్ను విధించనున్నారు. దీంతో జీహెచ్ఎంసీకి గణనీయంగా ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఉన్న భవనాలకు పన్ను పెంపును దశలవారీగా అమలు చేసే అవకాశం ఉంది. కొత్తగా నిర్మించే భవనాలకు కొత్త విధానం వెంటనే అమల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం తెలుస్తోంది. క్యూర్ బిల్లు అమల్లోకి వస్తే.. క్యూర్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడతారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా.. అందులో ఎవరైనా నివాసం ఉండే పరిస్థితి ఉన్నా.. కమిషనర్లు 24 గంటల ముందు నోటీసులు ఇచ్చి సీజ్ చేయొచ్చు. ఒకవేళ ప్రజల భద్రతకు ఇబ్బందిగా ఉంటే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సీజ్ చేసే అవకాశం ఉంటుంది. క్యూర్ చట్టంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చారు. ఖాళీ స్థలాల్లో చెత్త ఉంటే ప్లాట్ మూలధన విలువలో 0.25శాతం మేర జరిమానా విధిస్తారు. చెత్త తొలగించే వరకు జరిమానాల విధింపు ఉంటుంది. ఈ విధానం ద్వారా నగరాన్ని పరిశు భ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

### ఆహార భద్రతకు పెద్దపీట

బిల్లులో ఆహార భద్రతకు సంబంధించి కీలక ప్రతిపాదనలు ఉన్నాయి. కొత్త చట్టంలో అధ్యాయం-33లో ఆహార భద్రత, పోషకాహారం అంశాలను చేర్చారు. దీని ప్రకారం పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్‌గా, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కన్వీనర్‌గా 'ఆహార భద్రత, పోషకాహార కమిటీ' ఏర్పాటు చేస్తారు. క్యూర్ పరిధిలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల అమలును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. పర్యావరణం పరిరక్షణకూ ఈ క్యూర్ బిల్లులో ప్రాధాన్యత ఇచ్చారు. విపత్తుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు.

# ఢిల్లీకి రేవంత్ హమాలీ

## కాంగ్రెస్ పెద్దలకు సీఎం డబ్బు సంచుల మోత.. రాష్ట్ర ప్రయోజనాలు విస్మరణ

- హమాలీలు.. వడ్లు మోస్తూ ప్రజాసేవ
- బీఆర్ఎస్‌ను బద్నాం చేయడానికే..
- కాళేశ్వరం పంపులు బంద్
- సన్నాల బోనస్ ఎగ్గొట్టే కుట్ర
- రెండేళ్లలో మళ్లీ కేసీఆరే సీఎం
- సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం
- 18వ హమాలీ యూనియన్ ఆవిర్భావ
- దినోత్సవ మహాసభలో కేటీఆర్

హైదరాబాద్/ఉప్పల్, జూలై 6: హమాలీ కార్మికులు కష్టపడి వడ్ల బస్తాలు మోస్తూ ప్రజాసేవ చేస్తోంటే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ పెద్దల కోసం డబ్బు సంచులు మోస్తూ పెద్ద హమా లీగా మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శిం చారు. అందుకే రాష్ట్ర ప్రయోజ నాలను విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను బద్నాం చేయడానికే కాళేశ్వరం పంపులను ముఖ్యమంత్రి ఆన్ చేయడం లేదని, నీళ్లిస్తే మద్దతు ధర, బోనస్ ఇవ్వాలనే దురుద్దేశంతోనే పంటలను ఎండబె డుతున్నారని ఆరోపించారు. హమాలీల సమస్యలన్నింటినీ పరిష్కరించే 'బాధ్యత నాదే'నని, రెండేళ్లలో మళ్లీ కేసీఆర్‌ను సీఎంను చేసుకుందామని హమాలీల కు పిలుపునిచ్చారు. మల్లాపూర్‌లో సో మవారం నిర్వహించిన 18వ హమాలీ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హమాలీలు వడ్ల బస్తాలు మోసి ప్రజలకు అన్నం అందించే గొప్ప సేవ చేస్తున్నారని, కానీ ముఖ్యమంత్రి మాత్రం ఢిల్లీలోని తన పార్టీ పెద్దలను సంతోషపెట్టేం దుకు డబ్బుల సంచులు మోస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో హమాలీలు, రైతులు, మిల్లు యజమానులు అందరూ సంతోషంగా ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని అన్నారు. బీఆర్ఎస్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని, అందుకే కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్‌లు (రెండు పంపులు) ప్రారంభించ కుండా లక్ష క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారని ఆరోపించారు. రైతులకు నీరు అందిస్తే ఎరువులు ఇవ్వాలి, పంటలు పండితే మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే దురుద్దేశంతోనే ప్రభుత్వం నీటిని విడుదల చేయడం లేదని విమర్శించారు. నీరు అందు బాటులో ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా పంటలను ఎండబెట్టి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. కన్నెపల్లి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని, తమపై ఎంత కోపం ఉన్నా కేసులు పెట్టుకోవచ్చని, కానీ రైతులపై కక్ష సాధింపు చర్యలు తీసుకోవద్దని కోరినట్లు కేటీఆర్ తెలిపారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని, కానీ రైతులను వేధిస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రాన్ని మంచి నాయకుడు పాలిస్తే పేదలు, రైతులు, హమాలీలు, మిల్లు యజమానులు అందరూ సంతోషంగా ఉంటారని, కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అదే చూసిందన్నారు. గోదావరిలో నీరు ఉన్న ప్రాంతాన్ని గుర్తించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడం వల్ల సాగు విస్తీర్ణం భారీగా పెరిగి, తెలంగాణ సస్యశ్యామలంగా మారిందన్నారు. రైతులు అభివృద్ధి చెందితే హమాలీలకు కూడా ఉపాధి పెరిగిందని గుర్తు చేశారు. హమాలీల కష్టాన్ని గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం కూలీ రేట్లను రూ.8 నుంచి రూ.26కు పెంచిందని, దాదాపు 250 శాతం పెంపు సాధించడం బీఆర్ఎస్ ప్రభుత్వ ఘనత అని తెలిపారు. గతంలో ఐదేళ్లకోసారి మాత్రమే కూలీ రేట్లు పెరిగేవని, కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండేళ్లకోసారి రేట్లు సవరించడంతో హమాలీల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు. 18వ ఆవిర్భావ దినోత్సవానికి ఆహ్వానించిన హమాలీ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపిన కేటీఆర్, హమాలీల ప్రేమాభిమానాలకు రుణపడి ఉన్నానన్నారు. హమాలీ కార్మికుల ఆరోగ్య భద్రతతో పాటు వారి అన్ని సమస్యలను ఒక్కటొక్కటిగా పరిష్కరించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రస్తుతం అధికారంలో లేకపోయినా ప్రజల మద్దతు ఏమాత్రం తగ్గలేదని, కష్టకాలంలో పార్టీ వెంట నిలిచిన ప్రతి కార్యకర్తను, నాయకుడిని కాపాడుకుంటామని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండా ఎగరడం ఖాయమని, అందరూ ఐకమత్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. మరో రెండేళ్లలో కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుని, తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుదామని హమాలీ కార్మికులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

### హమాలీ సంఘం నేత మనుమడి పేరు 'కేసీఆర్'

హమాలీ సంఘం నేత శ్రీనివాస్.. తన కుమారుడు మహేందర్, కోడలు సుష్మితలకు 2025 సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం రోజున మనుమడు జన్మించాడు. తెలంగాణ చరిత్రలో ఆ రోజుకు ఉన్న ప్రాధాన్యతతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పోషించిన పాత్రను గుర్తు చేసుకుంటూ, రాబోయే తరాలు కూడా ఆయన సేవలను స్మరించాలనే సంకల్పంతో మనుమడికి 'కేసీఆర్' (కుర్మ చరణ్ రాజ్) అని పేరు పెట్టారు. హమాలీ మహాసభలో కేటీఆర్‌తో పంచుకున్నారు. బాలుడు మంచి భవిష్యత్తుతో ఎదగాలని కేటీఆర్ ఆశీర్వదించారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ నాటకాలు

(మొదటి పేజీ తరువాయి)



ఎన్ రాంచందర్‌రావు విమర్శించారు. కాళే శ్వరం అవినీతిపై సీఎం రేవంత్‌కి కలిగిన ఈ హఠా త్తు మమకారం వెనుక రహస్యం ఏంటో? ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఫాతిమా విద్యా సంస్థలపై చర్యలేవి అని ప్రశ్నించారు. పేదలకో న్యా యం.. ఎంఐఎంకు మరో న్యాయమా? వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రా పక్షపాత వైఖరిపై బీజేపీ పెద్ద ఎత్తున ప్రజాపోరాటం చేస్తామని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో జియో టెక్నికల్ రిపోర్టులు, ఇతర సాంకేతిక పరీక్షల ద్వారా డ్యాం సేఫ్టీ చర్యల్లేవని 'నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ' స్పష్టం చేసిందన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రిపేర్ పనులు ప్రారంభించకపోవడం వారి ఘోర నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును ఒక 'ఏటీ ఎం'లా మార్చుకుని, కేవలం డబ్బు, అహంకారంతోనే తరతరాలుగా రాజకీయం చేయొచ్చని భా వించిందని విమర్శించారు. ఇప్పుడు అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతిని పూర్తిగా మర్చిపోయారని, అక్కడ జరిగిన అవినీతిపై ఎలాంటి కఠిన చర్యలు లేకుండా, కేవలం కొందరు అధికారులపై నామమాత్రంగా చర్యలు తీసుకొని చేతులు దులుపుకు న్నారని మండిపడ్డారు. భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు సోమవారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షు డు ఎన్ రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజ రై, శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం అవినీతిపై రేవంత్‌రెడ్డికి ఉన్న ఈ హఠాత్తు 'మమకారం' వెనుక రహస్యం ఏంటో ప్రజలకు సమాధానం చెప్పాలని, ఇరు పార్టీలు కలిసి నాటకాలు ఆడుతూ ప్రజల జీవితాలతో చెలగాటమా డుతున్నాయని ఆరోపించారు.

### ఫాతిమా విద్యాసంస్థలపై చర్యలేవి?...

హైదరాబాద్ నగరంలో 'హైడ్రా' వ్యవహరిస్తు న్న తీరుపై రాంచందర్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో హైడ్రా పేరుతో పేదవాళ్ల ఇళ్లను నిర్ధాక్షిణ్యంగా కూలగొడుతున్న ప్రభుత్వం.. ఎంఐఎం పార్టీకి సంబంధించిన అక్రమ కట్టడాల జోలికి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. ఎం ఐఎంకు సంబంధించిన 'ఫాతిమా విద్యాసంస్థల విషయంలో స్పష్టంగా నిబంధనలను ఉల్లంఘించిందని, అదేవిధంగా స్వయంగా విద్యాశాఖ కూడా అనుమతులే లేవని కోర్టుకు తెలపడాన్ని ఆ యన గుర్తుచేశారు.

అంతేకాకుండా హైకోర్టు సైతం తప్పుపట్టిందని గుర్తుచేశారు. స్వయంగా హైడ్రా కూడా ఇది ఆక్రమణే అని అంగీకరించినప్పటికీ, అంత స్పష్టంగా కనబడుతున్న ఆ విద్యా సంస్థను, భవనాలను ఎందుకు కూల్చివేయడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంఐఎంతో ఉన్న దోస్తానా వల్లే ఈ వివక్ష చూపుతున్నా రని, హైడ్రా అంటే కేవలం పేదవాళ్ల ఇళ్లను కూల్చడానికే ఉందా అని దుయ్యబట్టారు. ఎంఐఎం అన్ని నిబంధనలు ఉల్లంఘించి, చెరువుల పక్కన కట్టడాలు కడితే హైడ్రా పర్మిషన్లు ఇస్తుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా అనేది నిష్పక్షపాతంగా పనిచేయాలని, పేదవాళ్లకు ఒక న్యాయం, ఎంఐఎంకు ఇంకో న్యాయం ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు.

హైకోర్టు ఆదేశాల ప్రకారం ఎంఐఎంకు చెందిన అక్రమ ఇన్‌స్టిట్యూషన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్, ఎంఐఎం, హైడ్రాపక్షపాత వైఖరి పై బీజేపీ ప్రజాపోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఏక్ దేశ్.. ఏక్ విధాన్.. ఏక్ ప్రధాన్ అనే మహోన్నత సంకల్పంతో అఖండ భారత సాధన కోసం జీవితాం తం శ్యామా ప్రసాద్ ముఖర్జీ కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో ఎస్ఎల్ బీసీ

(మొదటి పేజీ తరువాయి)

చేసి పనులు నిరంతరాయంగా సాగేందు కు అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. టన్నెల్‌తో పాటు డిండి ప్రాజెక్టు, బ్యాలెన్సింగ్ రిజర్వాయ ర్లు, కాలువల నిర్మాణాన్ని ఒకే సమగ్ర ప్రాజెక్టుగా భావించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో టన్నెల్ పనులు పునఃప్రారంభించిన తర్వాత ఇప్పటికే అర కిలోమీటర్‌కు పైగా పురోగతి నమోదైందని తెలిపారు.

దేవరకొండ వైపు నుంచి పనులు సంతృప్తికరంగా కొనసాగుతున్నాయని, శ్రీశైలం వైపు కూడా అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు సాగుతున్నాయని చెప్పారు. టన్నెల్ పనులను మరింత వేగవంతం చేసేందుకు మూడు అత్యాధునిక ఆర్మ్ బూమర్ యంత్రాలు ముంబై పోర్టుకు చేరాయని, ఈ నెలాఖరులో పను ల ప్రదేశానికి చేరుకుని నిర్మాణ వేగాన్ని మరింత పెంచనున్నాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి 40 టీఎంసీల నీటిని తరలించి 4.01 లక్షల ఎకరాలకు సాగునీరు, 618 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు, అలాగే పారిశ్రామిక అవసరాలకు నీటి సర ఫరా అందుతుందని మంత్రి వివరించారు. ఈ ప్రా జెక్టుకు సవరించిన పరిపాలనా అనుమతి వ్యయం సుమారు రూ.12,718 కోట్లు అని తెలిపారు. పనుల వేగం ఎంత ముఖ్యమైనదైనా, కార్మికుల భద్రత దానికంటే ముఖ్యమని స్పష్టం చేశారు. టన్నెల్ అంతటా తగిన లైటింగ్, సమర్థవంతమైన వెంటిలేషన్, సీనియర్ జియాలజిస్టులు, అథారిటీ ఇంజినీర్లు, నిపుణుల నిరంతర పర్యవేక్షణతో పనులు కొనసాగించాలని ఆదేశించారు. టన్నెల్ వద్ద పనిచేసే సిబ్బందిని ఇప్పటికే మూడింతలు పెంచినట్లు, అదనపు యంత్రాలు, ప్రత్యేక పరికరాలు, సాంకేతిక నిపుణులను సమీకరిస్తున్నట్లు తెలిపారు.

యంత్రాల రవాణా, కస్టమ్స్ అనుమతులు, సాంకేతిక సిబ్బంది నియామకం వంటి అంశాల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిండి ప్రాజెక్టు, నక్కలగండి రిజర్వాయర్, పెండ్లిపాకల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, కాలువల నెట్వర్క్ పూర్తయితేనే ఎస్ఎల్బీసీ పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని మంత్రి తెలిపారు. భూసేకరణ పరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను జూన్ నాటికి అన్ని విధాలుగా పూర్తి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ ప్రాజెక్టులు దక్షిణ తెలంగాణ రైతాంగానికి శాశ్వత సాగునీటి భరోసా, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు సురక్షిత తాగునీరు అందించి ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ చూపిస్తాయి అని అన్నారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఇంజినీర్ (జనరల్) వీ.రమేష్ బాబు, ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్థిక సవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

సాధ్యమవుతుందనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-ప్రాజెక్టును వేగవంతం చేసిన నేపథ్యంలో ప్రాజెక్టుకు కావాల్సిన 'రూ.24 వేల కోట్లకు పైగా నిధులను ఎలా సమీకరించాలి' అనేది ప్రస్తుతం ప్రభుత్వానికి అతిపెద్ద ప్రశ్నగా మారింది. ప్రభుత్వం 'మల్టీ -సోర్స్ ఫండింగ్ మోడల్' వైపు అడుగులు వేస్తోంది. అంటే ఒకే వనరుపై ఆధారపడకుండా రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీ, కేంద్ర ప్రభుత్వ సహాయం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి దీర్ఘకాలిక రుణాలు, దేశీయ బ్యాంకుల రుణాలు, ప్రైవేట్ పెట్టుబడులు, మెట్రో స్టేషన్ల వాణిజ్య అభివృద్ధి, ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్మెంట్(టీవోడీ) ద్వారా వచ్చే ఆదాయాలను కలిపి ప్రాజెక్టుకు నిధులు సమీకరించే వ్యూహాన్ని పరిశీలిస్తోంది. అయితే ఈ వ్యూహం విజయవంతం కావాలంటే కేంద్ర ఆర్థిక భాగస్వామ్యం, ఎస్బీఐ క్యాప్స్ రూపొందించే నివేదిక, ప్రాజెక్టు ఆదాయ సామర్థ్యంపై రుణాలు ఇచ్చే సంస్థల విశ్వాసం కీలకం కానున్నాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్- ప్రాజెక్టుకు నిధుల సమీకరణలో ఎస్బీఐ అధ్యయనం అత్యంత కీలకంగా మారింది. ప్రాజెక్టుకు ఎంత రుణం అవసరం? ఎంత మేరకు రుణం తీసుకునే సామర్థ్యం ఉంది? రుణాలను ఏ విధంగా సమీకరించాలి? అనే ప్రశ్నలకు ఈ అధ్యయన మే సమాధానం చెప్పనుంది. అందుకే ప్రభు త్వం, రుణదాతలు, పెట్టుబడిదారుల దృష్టి అం తా ఇప్పుడు ఎస్బీఐ క్యాప్స్ నివేదికపైనే ఉంది. మొదటిగా ఫేజ్ మెట్రో ఆస్తుల ప్రస్తుత మార్కెట్ విలువను ఎస్బీఐ అంచనా వేయనుంది. ఇప్పటికే నిర్మించిన మెట్రో కారిడార్లు, స్టేష న్లు, డిపోలు, వాణిజ్య ఆస్తులు, భవిష్యత్ ఆదా య సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని మొత్తం విలువ ఎంత ఉందో నిర్ధారిస్తుంది. ఈ విలువ ఆధారంగానే రుణదాతలు ఎంత మేరకు రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తారన్నది తేలనుంది. అంతేకాదు, ఫేజ్ పూర్తయిన తర్వాత ప్రయాణికుల సంఖ్య ఎంత పెరుగుతుం ది? టికెట్ ఆదాయం ఎంత ఉంటుంది? ప్రకటనలు, స్టేషన్లలో వాణిజ్య కార్యకలాపాలు, పార్కింగ్, ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్మెంట్ ద్వారా ఎంత ఆదాయం వచ్చే అవకాశం ఉంది? వంటి అంశాలపై కూడా సమగ్ర ఆర్థిక విశ్లేషణ చేయనుంది. ఈ అంచనాల ఆధారంగానే రుణాలను తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పరిశీలిస్తాయి.

### కేంద్ర ప్రభుత్వం సహకారం

కేంద్ర ప్రభుత్వ పాత్ర అత్యంత కీలకంగా మారే అవకాశం ఉంది. రూ.24 వేల కోట్లకు పైగా వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ఒక్కదానిపైనే ఆధారపడి చేపట్టడం ఆర్థికంగా సవాలుగా మారుతోంది. మెట్రో రైల్ విధానం ప్రకారం, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉంటే అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, దేశీయ బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడానికి మరింత ఆసక్తి చూపే అవకాశం ఉంటుంది. కేంద్రం మద్దతు లభిస్తే ప్రాజెక్టుపై పెట్టుబడిదారుల విశ్వాసం పెరగడంతో పాటు తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలు పొందే అవకాశాలు కూడా మెరుగవుతాయి. మరోవైపు, ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పెరుగుతున్న అప్పులు, ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నేపథ్యంలో కేంద్ర సహకారం లేకుండా మొత్తం ప్రాజెక్టు వ్యయాన్ని రాష్ట్రం భరించడం సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రం ఎంత మేర నిధులు కేటాయిస్తుంది? ఏ రూపంలో సహాయం అందిస్తుంది? అనే అంశాలపై స్పష్టత వచ్చిన తర్వాతే ప్రాజెక్టు ఆర్థిక నిర్మాణం పూర్తిగా ఖరారయ్యే అవకాశం ఉంది. అయితే కేంద్ర సహకారం మాత్రమే సరిపోదని నిపుణులు చెబుతున్నారు. మెట్రో ఫేజ్- అవసరమైన నిధులను సమీకరించడంలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థల రుణాలపైనే ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. టికెట్ ఆదాయంతో పాటు ఈ వాణిజ్య ఆదాయాలు పెరిగితేనే రుణాల చెల్లింపు భారం తగ్గి, ప్రాజెక్టు దీర్ఘకాలికంగా ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది. వాణిజ్య ఆదాయా లు ఆశించిన స్థాయిలో రాకపోయినా రుణాల చెల్లింపుపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక రుణాలు, కేంద్ర ప్రభుత్వ సహకారం, సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ, వ్యయ నియంత్రణ వంటి అంశాలు సమన్వయంగా అమలైతేనే మెట్రో ఫేజ్ దీర్ఘకాలంలో ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది.

# పాముకాటుతో వేములవాడ కౌన్సిలర్ తండ్రి మృతి

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్.

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) జూలై 06:**



పాముకాటుకు గురై కౌన్సిలర్ తండ్రి రాజయ్య మృతి చెందిన సంఘటన వేములవాడ పట్టణంలో సోమవారం తీవ్ర విషాదాన్ని నింపింది. మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ ఏల శ్రీనివాస్ తండ్రి రాజయ్య పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వెంటనే ఆయన వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు కొక్కుల బాలకృష్ణ, కొండ రాజశేఖర్, మైలారం శ్రీనివాస్, నాయకులు సిరిగిరి శ్రీకాంత్, గుడిసె కరుణాకర్‌లతో కలిసి వేములవాడ ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో రాజయ్య పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న కౌన్సిలర్ శ్రీనివాస్, ఆయన కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్మన్ తో పాటు ప్రజాప్రతినిధులు ఓదార్చారు. వారికి ధైర్యం చెబుతూ తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ కౌన్సిలర్ ఎల శ్రీనివాస్ కుటుంబానికి పితృవియోగం కలగడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజయ్య మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కష్టకాలంలో శ్రీనివాస్ కుటుంబానికి తామంతా అండగా ఉంటామని, పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలు ఎల్లప్పుడూ తోడుగా నిలుస్తారని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్, కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కాంగ్రెస్ మైనారిటీ నాయకులు సయ్యద్ సాబీర్, నాగుల విష్ణు, పాత్రికేయులు పాష సయ్యద్, రసూల్, సయ్యద్ అలీ, పెద్ద ఎత్తున ప్రజలు, తెరాస నాయకులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొన్నారు.



# శ్రీ రాజరాజేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.11 లక్షల విరాళం

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) జూలై 6:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన ట్రస్టుకు హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన శ్రీ చంద్రమౌళి, శ్రీమతి కమల దంపతులు రూ.11 లక్షల విరాళాన్ని అందజేశారు. దేవస్థానం పీఆర్వో కార్యాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శ్రీమతి ఎల్. రమాదేవి కు చెక్కు రూపంలో విరాళాన్ని అందించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు వారికి స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదం అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రోటోకాల్ అధికారి అశోక్ కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సీఎం. ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు టేకులపల్లి) జూలై 06**

ముత్యాలంపాడు ౪ రోడ్డు రైతు వేదిక నందు లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రజల ఆరోగ్య భద్రతకు అండగా నిలుస్తూ, వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం ఆర్ ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 83 మంది లబ్ధిదారులకు రూ 23,35,000/- విలువైన సి. ఎం ఆర్ ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకం సకాలంలో చేరేలా తాము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎం ఆర్ ఎఫ్ ద్వారా అందుతున్న ఈ సహాయం అనేక పేద కుటుంబాలకు ఆపద్బాంధవంగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి గారికి, ఎమ్మెల్యే కోరం కనకయ్యకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్కినేని శ్యామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, జిల్లా ప్రధానకార్యదర్శికాలేప్రసాద్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులుకోరంసురేందర్, సర్పంచులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కురవి మండల కాంగ్రెస్ పార్టీ లో అంతర్గత విబేధాల కలవరం

**కురవి జులై 06 (ప్రజా తీర్పు):**

కురవి మండలం లో గత ముప్పై సంవత్సరాల పాటు నిస్వార్థ రాజకీయ నాయకుడి గా ఎదిగి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని తన శక్తి సామర్థ్యాలకు మించి ఈ రోజు వరకు కూడా ఎవరిని నొప్పించకుండా తెలిసిన వ్యక్తి గా ఉంటూ, ప్రతి ఒక్కరిని నా తోబుట్టువులుగా అనుగుణంగా నడుచుకొంటూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త నే కాకుండా అందరినీ సమానంగా చూసుకుంటూనే వస్తున్న కురవి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు అంబటి వీరభద్రం గౌడ్ పై వస్తున్న తప్పుడు ప్రచారాలు,ఆరోపణలు అవాస్తవం,నిరాధారమైన విమర్శలు మానుకోవాలంటూ సోమవారం నాడు కురవి మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ల సమావేశం నిర్వహించి ప్రకటించారు. అదే కాకుండా పలువురు కురవి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,పార్టీ కి చెందిన ప్రజాప్రతినిధులు నాయకులు ఇలాంటి విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు మరియు కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు యోగ మ్యాట్లు,టీషర్ట్‌లపంపిణీ చేసిన ఎమ్మెల్యే కోరం.కనకయ్య

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు టేకులపల్లి ) జూలై 06**




కోయగూడెం గ్రామ పంచాయతీ ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులుకోరం కనకయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగ మ్యాట్లు. టీ-షర్ట్‌లనుపంపిణీ చేసి వారికి విలువైన సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతిరోజూ యోగను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగ సాధన ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతుందని, మంచి ఆరోగ్యం ఉంటేనే విద్యలో ఉన్నత ఫలితాలు సాధించగలరని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, విద్య, ఆరోగ్యం, క్రీడలకు సంబంధించిన అన్ని రంగాల్లో అవసరమైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు యోగ మ్యాట్లు, టీ-షర్ట్‌లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే క్రమశిక్షణతో చదువుకొని సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల మెరుగుదలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోయగూడెం సర్పంచ్ కోరంసుభాష్. చంద్రబోస్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదర్శ ఖాకిలకు అభినందన పురస్కారం

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 6.**



రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకొని వ్యక్తి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి, వేణులకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రశంసలు -- నగదు రివార్డు విధి నిర్వహణలో అప్రమత్తత, వేగవంతమైన స్పందన, మానవీయ దృక్పథంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిన మల్యాల పోలీస్ స్టేషన్‌కు చెందిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి మరియు వేణులను జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. వారి సేవలను గుర్తిస్తూ నగదు రివార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడడం పోలీసుల అత్యున్నత బాధ్యత అని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో స్పందించడం, మానవత్వంతో వ్యవహరించడం ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. విధి నిర్వహణలో నిబద్ధత, సేవా భావంతో పనిచేసిన కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి, వేణులను ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, ఇలాంటి సేవలు పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచుతాయని అన్నారు. నిన్న సాయంత్రం సుమారు 5.00 గంటల సమయంలో, మల్యాల మండలంలోని నూకపల్లి గ్రామ శివారులో రైల్వే ట్రాక్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి గాయాలతో పడిఉన్నాడని డయల్-100 ద్వారా సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే బ్లూ కోల్ట్స్ సిబ్బంది కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి మరియు వేణు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఒక వ్యక్తి మానసిక పరిస్థితి సరిగా లేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. తలకు తీవ్ర గాయమై రైల్వే ట్రాక్‌పైనే పడిఉండటంతో ప్రాణాపాయం ఉన్నట్లు గ్రహించిన పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అతడిని ట్రాక్‌పై నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం ప్రథమ చికిత్స అందించి, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి గాయపడిన వ్యక్తిని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టారు.

# మంచిర్యాల : హోంగార్డు గట్టక్క మరణం బాధాకరం మందమర్రి సిఐ పర్స రమేష్.

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల మండల్) జూలై 6**



మందమర్రి పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మరణించిన హోంగార్డు గట్టక్క కుటుంబాన్ని వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన అనంతరం సిఐ పర్స రమేష్ ఆమె భౌతిక కాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం గట్టక్కను బలి తీసుకుందని ఇంత తక్కువ వయస్సులో ఆమె మరణించడం ఆ కుటుంబానికి చాలా దురదృష్ట సంఘటనగా ఆయన పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తామని కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు మజీద్ ఖాన్, మిలన్, పోలీస్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఎఫ్ ఐ సి సి యూత్ ఆధ్వర్యంలో వృద్ధురాలికి పదివేల ఆర్థిక సాయం

**(పగడాల రామారావు ప్రజా తీర్పు బయ్యారం మండల ప్రతినిధి ) జూలై 6**

బయ్యారం. స్థానిక మండల పరిధి గంధంపల్లిఆంజనేయ స్వామి ఆలయం పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు ఎంతోకాలంగా సేవ చేస్తున్న ఓ వృద్ధురాలికి ఆర్థిక సహాయం అందించిన ఎఫ్ఐసిసియూత్ స్థానిక మండల పరిధి మండలం గంధం పల్లి గ్రామంలో ఎఫ్ ఐ సి సి యూత్ ఆధ్వర్యంలో వృద్ధురాలికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం. "మానవ సేవే మాధవ సేవ" అనే మాటను ఆచరణలో చూపించిన ఈ యువత సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఆలయ పరిశుభ్రత కోసం నిస్వార్థంగా శ్రమిస్తున్న వృద్ధురాలి కష్టాన్ని గుర్తించి, ఆమెకు చేయూతనివ్వడం గొప్ప మానవత్వానికి నిదర్శనం. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో దయ, కరుణ, బాధ్యత అనే విలువలను మరింత పెంపొందిస్తాయి. ఈ మంచి మనసుతో ముందుకు వచ్చిన యువతకు హృదయపూర్వక అభినందనలు. వారి సేవా స్ఫూర్తి మరెందరికో ప్రేరణగా నిలవాలని, ఇంకా ఎవరైనా దాతలు ఉంటే ఆ ముసలమ్మ ఆర్థిక సాయం చేయాలని వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తుల తక్షణ పరిష్కారం

**(వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్) జూలై 6**

మల్కాజిగిరి జిల్లా సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ మాలతి లతో కలిసి అదనపు కలెక్టరు (79) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నా.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూలై 6**



రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ లు, ఏ.ఈ.ఆర్.ఓ లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 25వ తేదీ నుండి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు వివరాలు నమోదు చేసిన పిదప తిరిగి తీసుకొని సంబంధిత బిఎల్ఓ యాప్ లో డిజిటైజేషన్ చేపట్టాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాల నమోదుకు వాలంటీర్లను ఉపయోగించుకొని ఓటర్లకు సహాయ పడాలని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జూలై 20 వ తేదీ నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. డిజిటైజేషన్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని, ఒక పోలింగ్ కేంద్రంలో 1 వేయి 200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్లు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా తప్పుడు సమాచారం సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులకు సూపర్వైజర్లు, వాలంటీర్లు సహాయం అందించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో నేటి వరకు 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ చేయడం జరిగిందని, 6.8 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని, వచ్చే సోమవారం నాటికి 50 శాతం డిజిటైజేషన్ పూర్తి చేస్తామని, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పకడ్బందీగా చేపడతామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు, బూత్ స్థాయి ఏజెంట్లకు కార్యాచరణ ప్రకారంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం చేసేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లేని భూమికి పట్టా ఎలా?..

- ఎలిగేడులో 18 గుంటల అక్రమ నమోదు కలకలం
- సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు..

క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 6 :**




ఎలిగేడు మండలం ఎలిగేడు గ్రామ శివారులోని సర్వే నంబర్ 226లో అసలు మిగులు భూమి లేకపోయినా 18 గుంటల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదు చేశారని రైతులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నంబర్ 226లో మొత్తం 11 ఎకరాల 20 గుంటల భూమి ఉండగా, అందులో 2 ఎకరాల 10 గుంటలను ఎస్సారెస్పీ కాలువ, ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మిగిలిన 9 ఎకరాల 10 గుంటలు సింగిరెడ్డి కుటుంబం ఆధీనంలోనే ఉండగా, అదనపు భూమి ఏదీ లేదని పేర్కొన్నారు. అయితే, 2012లో లేని 18 గుంటల భూమిని మూసాల యుగంధర్ రెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేయగా, 2015లో అదే భూమిని ముంజంపల్లి లింగమూర్తి పేరిట మళ్లీ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపించారు. అనంతరం ఆ భూమిని పట్టాదారు పాస్‌బుక్‌లో కూడా నమోదు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. రైతులు సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన రికార్డులు, తహసీల్దార్ సమర్పించిన నివేదికలో సర్వే నంబర్ 226లో ఎలాంటి మిగులు భూమి లేదని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. ఆ ఆధారాలతో 2025 మే 13న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, సంబంధిత 18 గుంటల నమోదును రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించారని చెప్పారు. అయితే, అనంతరం ల్యాండ్ సర్వే అధికారుల నివేదిక ఆధారంగా అదే నమోదును తిరిగి పునరుద్ధరించడం జరిగిందని ఆరోపించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుల నేపథ్యంలో ఇటీవల జిల్లా రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించగా, విజిలెన్స్ ఆదేశాల మేరకు మరోసారి సర్వే కూడా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ, లేని భూమిని ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయడం అత్యంత తీవ్రమైన అక్రమమని, దీనివల్ల ప్రభుత్వానికి నష్టం జరిగే అవకాశముందని అన్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులు, సంబంధిత వ్యక్తులపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే సర్వే నంబర్ 226లోని 18 గుంటల అక్రమ నమోదును శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సింగిరెడ్డి రామచంద్రారెడ్డి, కోటిచింతల మురళీధర్ రావు, తాటికొండ అనిల్, భీంసేన్ గొడిసేలా తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వం ప్లాస్టిక్ వస్తువుల నిషేదంలో కఠినంగా ఉండాలి

సామాజిక వేత్త ఏ సి ఎస్ రాజు...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 6.**

ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలని వినతి పత్రం సమర్పించిన భారత్ సురక్ష సమితి" రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్, సామాజిక వేత్త ఏసీఎస్ రాజు...సోమవారం జరిగిన ప్రజావాణిలో జగిత్యాల జిల్లాలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలని కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వటం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసిఎస్ రాజు సామాజిక సమరసత వేదిక కరీంనగర్ విభాగ్ సంయోజక్ చిట్ల గంగాధర్ లు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల భూమి నీరు గాలి కలుషితమవుతున్నాయని ప్లాస్టిక్ వస్తువుల నుంచి వెలువడే విషవాయువుల వల్ల క్యాన్సర్ శ్వాస కోస సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వాటి బారిన పడి జంతువులు కూడా మృతి చెందుతున్నాయని, పర్యావరణాన్ని, మానవుని ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలని ముఖ్యంగా ఫంక్షన్ హాల్ల లో కూడా ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి బదులు స్టీల్ వస్తువులను వినియోగించాలని పేర్కొన్నారు. కలెక్టర్ గారు కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో నాయకులు సింగం గంగాధర్ వేముల పోచమల్లు నరేందుల శ్రీనివాస్ వేముల దేవరాజం కొత్తకొండ బాలన్న ఎడమల వెంకట్ రెడ్డి గాదాసు భూమన్న చిలుక రాజన్న ఆడెపు జానయ్య నాయని సంజీవరావు బొందుకూరి శ్రీనివాస్ మొదలగు వారు పాల్గొన్నారు.



## శామీర్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు నక్క సందీప్ గౌడ్‌కు ఘన సత్కారం

**(వినోద్, ప్రజా తీర్పు, శామీర్ పేట్, మేడ్చల్ జిల్లా) జూలై 06**

మేడ్చల్ జిల్లా, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 300వ శామీర్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన నక్క సందీప్ గౌడ్ను బాబాగూడ, బొమ్మరాసిపేట్ గ్రామాల కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాబాగూడ గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సందని ఆనంద్, మేడి సత్యనారాయణ, సింగిరెడ్డి శ్రీపాల్ రెడ్డి, ఏర్పుల నరసింహ, అలాగే బొమ్మరాసిపేట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు అయ్యన్నగారి లక్ష్మారెడ్డి, పంబలి అశోక్, ఈడిగళ్ల ఏసుదాస్ శాలువాతో నక్క సందీప్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నూతన డివిజన్ అధ్యక్షుడు నక్క సందీప్ గౌడ్ సమర్థవంతంగా పనిచేసి పార్టీని ప్రజల్లో మరింత బలోపేతం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం నక్క సందీప్ గౌడ్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు అంకితభావంతో పనిచేస్తానని, డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువ నాయకులు మరియు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## రూ.100 కోట్ల నిధులు

- ఈఎస్ఐ ఆస్పత్రి మాత్రం ఎక్కడ?
- కలెక్టర్‌కు స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక వినతి

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 6 :**

రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి కేంద్ర ప్రభుత్వం 2018లోనే సుమారు రూ.100 కోట్లతో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రికి ఆమోదం తెలిపినా, ఎనిమిదేళ్లు గడిచినా నిర్మాణం ప్రారంభం కాకపోవడంపై రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. స్థల సేకరణ, పరిపాలనా జాప్యంతో కార్మికుల ఆరోగ్య హక్కులు దెబ్బతింటున్నాయని మండిపడింది.ఈ అంశంపై సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఐక్యవేదిక ప్రతినిధులు మద్దెల దినేష్, దుర్గం నగేష్, గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ.. దేశానికి బొగ్గు, విద్యుత్, ఎరువుల ఉత్పత్తిలో కీలకమైన రామగుండం ప్రాంతానికి పూర్తి స్థాయి ఈఎస్ఐ ఆస్పత్రి లేకపోవడం ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం స్థలాన్ని ఆమోదించినా, జిల్లా స్థాయిలో నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, వారి కుటుంబాలు నాణ్యమైన వైద్య సేవలకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి కార్మికుల ఆరోగ్య భద్రత అత్యంత కీలకమని, రూ.100 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ ఆస్పత్రి నిర్మాణం ఆలస్యం కావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకుని భూ సేకరణ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంది సుజాత, కొండు రమాదేవి, వై. లెనిన్, కె. రవి పాల్గొన్నారు.



## జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమం

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) జులై 6**

గార్ల. ప్రపంచ జూనోసెస్ డే సందర్భంగా సోమవారం స్థానిక మండల కేంద్రంప్రాథమిక పశు వైద్య కేంద్రం,నందు పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబీస్ టీకాల కార్యక్రమాన్ని స్థానిక మేజర్ గ్రామపంచాయతీసర్పంచ్ బానోత్ పార్వతి హతీరాం నాయక్ ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ జంతువుల నుండి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాటికి సకాలంలో టీకాలు వేయించాలని కోరారు. కలుషిత ఆహారం ద్వారా వ్యాధులు వ్యాపించకుండా మాంసం గుడ్లు ఉడికించి తినాలని కోరారు. పెంపుడు జంతువుల ఏదైనా అనారోగ్య సమస్య వస్తే పశు వైద్యుడిని సంప్రదించాలని కోరారు. అనంతరం 60 కి పైన పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు ముల్కనూరు పశువైద్యాధికారులు డాక్టర్ వి.సురేష్ కుమార్, డాక్టర్ బానోత్ రాజేష్ లు జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది శేఖర్,చందూలాల్, సంజీవ్, రవి,పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.



## ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం

**నర్సంపేట, జులై, 06 (ప్రజా తీర్పు ప్రతినిధి)**

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా నర్సంపేట ఏరియా వెటర్నరీ హాస్పిటల్‌లో పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నర్సంపేట సహాయ సంచాలకులు డా. బి. నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సహాయ సంచాలకులు డా. బి. నర్సింహారెడ్డి మాట్లాడుతూ, రేబిస్ వ్యాధి జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే ప్రాణాంతక జూనోటిక్ వ్యాధి అని, సకాలంలో వ్యాక్సినేషన్ చేయించడం ద్వారా దీనిని నివారించవచ్చని తెలిపారు. కుక్కల పెంపకందారులు, జంతు ప్రేమికులు తమ పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలని సూచించారు. అలాగే కుక్క కాటుకు గురైనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మండల పశువైద్యాధికారి డా. ఆర్. శ్రవణ్ కుమార్, ఎం.డి. మాషు రబ్బానీ, బి. గణేష్, ఎస్. సాయి విశ్వనాథ్, ఎన్. రాజు, కె. అన్వేష్, పెంపుడు జంతువుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు జన్మదినం పురస్కరించుకొని మొక్కలు నాటారు

**నిజాంసాగర్ / జూలై 06( ప్రజా తీర్పు )**



జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంసాగర్ మండలం మంగ్లూర్ గ్రామంలో ఆయన మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు మద్నూర్ మండలంలోని సలాబద్పూర్ హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికోసం, ప్రజల సుఖశాంతుల కోసం ప్రార్థించారు. కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్,పిట్లం ఏఎంసి చైర్మన్ మనోజ్ కుమార్, నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, నర్సింగ్ రావు పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అజయ్ రెడ్డి, రమేష్ గౌడ్, మంగళూరు గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు చాకలి సాయిలు, గైని దత్తు, పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడికి సన్మానం

**కోరుట్ల జూలై 06 (ప్రజాతీర్పు)**



రాష్ట్ర ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన జువ్వాడి చంద్రశేఖర్ రావుకు కోరుట్లలో ఘన సన్మానం నిర్వహించారు. కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు కొంతం రాజాం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొంతం రాజాం మాట్లాడుతూ రాష్ట్ర ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా జువ్వాడి చంద్రశేఖర్ రావు ఎన్నిక కావడం కోరుట్ల ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన పదవీకాలంలో సినీ రంగ అభివృద్ధికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఏలేటి పుల్లారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జువ్వాడి చంద్రశేఖర్ రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## బాబు జగ్జీవన్ రామ్ ఆశయసాధనకు కృషి చేయాలి: డాక్టర్ పేట భాస్కర్

**కోరుట్ల జూలై 6 (ప్రజాతీర్పు)**





భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా సోమవారం కోరుట్ల పట్టణంలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రజా దండోర దినపత్రిక ఎడిటర్ డాక్టర్ పేట భాస్కర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ఆశయసాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అలాగే ఆయన పేరిట నిర్మిస్తున్న జగ్జీవన్ పార్కును త్వరితగతిన అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజాప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, చిట్యాల లచ్చయ్య, శనిగారపు రాజేష్, ఎం.డి. సాబీర్, చిట్యాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

- ఏకగ్రీవంగా ఎన్నిక.. క్రీడాభివృద్ధికి కృషి చేయాలని పిలుపు

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 6 :**



పెద్దపల్లి జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న బి.ఎం.ఆర్ కరాటే అండ్ కిక్‌బాక్సింగ్ అకాడమీలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ, జిల్లాలో కిక్‌బాక్సింగ్ క్రీడను గ్రామీణ స్థాయి వరకు విస్తరించేలా నూతన కార్యవర్గం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ, ప్రోత్సాహం అందించాలని అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా ఎం. రాజేశం, ప్రధాన కార్యదర్శిగా కర్ర వెంకటేష్, కోశాధికారిగా ఐ. రాము, ఉపాధ్యక్షుడిగా జి. నారాయణ, సంయుక్త కార్యదర్శిగా పి. చందర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రామ్ చరణ్, లక్ష్మణ్, సూర్యనారాయణ, నర్సింగ్ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, జిల్లాలో కిక్‌బాక్సింగ్ క్రీడాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ శిక్షణా శిబిరాలు, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం బి.ఎం.ఆర్ కరాటే అండ్ కిక్‌బాక్సింగ్ అకాడమీ వ్యవస్థాపకుడు బండారి సంతోష్ నూతన కార్యవర్గాన్ని అభినందించి, వారి నాయకత్వంలో పెద్దపల్లి జిల్లా కిక్‌బాక్సింగ్ క్రీడ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



## ఘనంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

**కోరుట్ల జూలై 6 (ప్రజాతీర్పు)**


భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా కోరుట్ల బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అనూప్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయవాద భావజాలం కోసం విశేష సేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. భారతీయ జనసంఘ్ స్థాపనతో దేశ రాజకీయాల్లో కొత్త దిశను చూపారని, ఆయన ఆశయాలు నేటికీ దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కార్యదర్శి సూదవేణి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గిన్నెల శ్రీకాంత్, తులసి కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, మ్యాకల గణేష్, గందే నవీన్, ఉపాధ్యక్షులు రంజిత్ రావు, గోనెల రాజశేఖర్, చట్పల్లి ఓం ప్రకాష్, క్తైరం కొండ రాజగంగారం, సీనియర్ నాయకులు ఉరుమాడ్ల చరణ్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు ధమ్మా సంతోష్, బాల్క ప్రేమ్ సాగర్, వళ్ళోజి నగేష్, దామ శ్రవణ్, తోట దుర్గాప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు పూర్ణిమ చౌదరి, నీలి గాయత్రి, బీజేవైఎం కార్యకర్తలు కొక్కుల బలరాం, రాకేష్ పాల్గొన్నారు.



## పలు బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శ

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) జులై 06:**

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేకల రాజేశం తండ్రి పోలయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ముంజంపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి తిరుపతి రెడ్డి ఇటీవలే మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మంత్రి వెంట బిఆర్ఎస్ మండల పార్టీ నాయకులు సింహాచలం జగన్, గాజుల మల్లేశం, వ్యాళ్ల రాంరెడ్డి, అల్లె వెంకటేష్ యాదవ్, మేరుగు జానీ, కోడి గంగయ్య, గాదే భాస్కర్, ఉప్పు రాజయ్య, పడిదం వెంకటేష్, పడిదం నారాయణ,చందు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.



## పెయింటింగ్ కార్మికునికి రావలసిన వేతనం ఇప్పించిన -బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

**దుండిగల్, జులై 6(ప్రజా తీర్పు )**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గండి మైసమ్మ ఏరియాలో సతీష్ కుమార్ కార్మికుడు పెయింటింగ్ కాంటాక్ట్ దగ్గర పని చేసేవాడు, కార్మికుడు సతీష్ కుమార్ కి గత నెల మార్చి నెల వేతనం మొత్తం 20,000/- వేల రూపాయలు సతీష్ కుమార్ కు రావాల్సి ఉండగా పెయింటింగ్ కాంటాక్ట్ నిర్లక్ష్యం చేస్తూ అతనికి వేతనం ఇవ్వకుండా మాయమాటలు చెప్పి అతని ఇబ్బంది పెట్టేవాడు, అడిగి అడిగి విసుగు చెందిన కార్మికుడు కి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు...వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన పెయింటింగ్ కాంటాక్ట్ దగ్గరికి వెళ్లి పెయింటింగ్ కార్మికుడు సతీష్ కుమార్ కు రావాల్సిన వేతనం మొత్తం 20,000/- రూపాయలు ఇప్పించడం జరిగింది... కార్మికుడు సతీష్ కుమార్ మాట్లాడుతూ నాకు మా కుటుంబానికి న్యాయం చేసిన కార్మికనాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు...ఈ కార్యక్రమంలో, సంతోష్ గౌడ్ సుదర్శన్, పాల్గొన్నారు...



## ప్రజా సమస్యలు గాలికొదిలేసిన మునిసిపల్ కమిషనర్

**సిద్ధిపేట్ జిల్లా హుస్నాబాద్ జులై 06 ప్రజా తీర్పు**

హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని, దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే నిలిచిపోయాయని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజలు తమ పనుల కోసం రోజుల తరబడి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని దీంతో వారు అసహనానికి గురవుతున్నారని చెప్పారు. కమిషనర్, లేదా మూడు రోజులకు ఒకసారి కార్యాలయంలో ఒక గంట సమయం ప్రజలకు ఇస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. హుస్నాబాద్ పర్యటనకు మంత్రి వచ్చినప్పుడు మాత్రమే సమయం కేటాయిస్తున్నట్లు కనబడుతుందని, ప్రజలు తమ సమస్యలను ఫోన్ ద్వారా చెప్తాం అనుకుంటే మీటింగ్ లతో బిజీగా ఉన్నట్టు స్వయంగా కార్యాలయ అధికారులే చెప్తున్నట్లు వెల్లడించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ ను బదిలీ చేయించాలని లేకుంటే సిద్దిపేట మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ గా ఇచ్చిన బాధ్యతలను రద్దు చేయించాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రజలకు అందుబాటుగా ఉంటూ సమస్యలు తీర్చాలని పేర్కొన్నారు.

# బెల్లంపల్లిలో జర్నలిస్టుల భూమిని అర్ధరాత్రి ట్రాక్టర్లతో చెదును చేసిన భూ కబ్జాదారులు

- ఒక నాయకుడు ఇంట్లో రహస్య మంతనాలు
- భూ కబ్జా దారులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- జర్నలిస్టుల డిమాండ్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జూలై 6**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి లో ప్రభుత్వ భూముల కబ్జా వ్యవహారం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిని అర్ధరాత్రి వేళ ట్రాక్టర్లతో చదును చేయడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూములపై ఎవరి అండతో ఈ దందా నడుస్తోంది? నకిలీ పత్రాలతో కోట్ల విలువైన భూములను కాజేస్తున్న ముఠా వెనుక ఎవరున్నారు? ఈ వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యమా.. లేక రాజకీయ అండదండలా? అనే ప్రశ్నలు ఇప్పుడు బెల్లంపల్లిలో వినిపిస్తున్నాయి. బెల్లంపల్లి పట్టణ శివారులోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలోగల జర్నలిస్టుల గృహ స్థలాల కోసం ప్రభుత్వం కేటాయించిన భూమిని గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళ ట్రాక్టర్లతో చదును చేశారు. ఉదయం విషయం తెలుసుకున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు అక్కడికి చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక భూమి చదును చేసిన ఘటన మాత్రమే కాదని, ప్రభుత్వ భూములను లక్ష్యంగా చేసుకుని కబ్జా ముఠాలు పద్ధతి ప్రకారం పనిచేస్తున్నాయని జర్నలిస్టులు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడిని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములను ఆక్రమించడం, నకిలీ పత్రాలు సృష్టించడం, అనంతరం వాటిని విక్రయిస్తూ కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమాలకు కొందరు అధికారుల సహకారం కూడా ఉందని జర్నలిస్టులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూముల రక్షణలో రెవెన్యూ శాఖ పూర్తిగా విఫలమైందని విమర్శిస్తున్నారు. జర్నలిస్టుల కాలనీని చదును చేసిన ట్రాక్టర్ల యజమానులను వెంటనే గుర్తించి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ట్రాక్టర్ యజమానులు డబ్బు ఆశతో ఇలాంటి పనులకు వెళ్లి కేసుల్లో చిక్కుకోవద్దని జర్నలిస్టులు, హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడటం అధికారుల బాధ్యత అని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని అక్రమాలను అడ్డుకోవాలని జర్నలిస్టులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం ఈ ఘటన బెల్లంపల్లి ప్రాంతంలో తీవ్ర చర్చకు దారితీసింది. జర్నలిస్టుల కేటాయించిన భూమి కోసం కొందరు కుమ్మక్కై ఒక నాయకుడు ఇంట్లో రహస్య సమావేశమైనట్లు గుసగుసలు వెల్లువెత్తుతున్నాయి



## ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ అందరూ జర్నలిస్టులదే

- అన్ని జర్నలిస్టు సంఘాలకు సమాన అవకాశాలు కల్పించాలి.
- కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజే (హెచ్-143) వినతి.

**(నారుకట్ల మధు ప్రజాతీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జులై 6**

వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనాన్ని అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులు సమానంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (హెచ్-143) వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలోజిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేములవాడ ప్రెస్ క్లబ్ భవనం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ప్రభుత్వ నిధులతో నిర్మించబడిన జర్నలిస్టుల అందరి ఆస్తి అని పేర్కొన్నారు. ఈ భవనం ఏ ఒక్క జర్నలిస్టు సంఘానికి మాత్రమే పరిమితం కాకుండా,వేములవాడ ప్రాంతంలోని అన్ని జర్నలిస్టుల వృత్తిపరమైన అవసరాలు, సమావేశాలు,శిక్షణా కార్యక్రమాలు,సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ కోసం ఏర్పాటు చేయబడిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనాన్ని ఏ ఒక్క సంఘానికే పరిమితం చేయకుండా, గుర్తింపు పొందిన వేములవాడ ప్రాంతంలోని అన్ని జర్నలిస్టు సంఘాల సభ్యులు ఎలాంటి వివక్ష లేకుండా వినియోగించుకునేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. జర్నలిస్టుల ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, సమానత్వం, వివక్ష రహిత విధానం అమలయ్యేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాలని టీయూడబ్ల్యూజే (హెచ్-143) విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సభ్యులు జితేందర్, ఉపాధ్యక్షులు సిహెచ్.దేవరాజు, విష్ణు, జబ్బార్, పంపరి నాగరాజు,ఫాహద్, జిల్లా రమేష్, కముటాల విజయ్, చౌటుపల్లి వెంకటేష్, షబ్బీర్, ఇమ్రాన్, అజర్ లు పాల్గొన్నారు.



## జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు

- బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**బీర్‌పూర్, జూలై 6 (ప్రజా తీర్పు):**

జగిత్యాల ప్రాంత అభివృద్ధి ప్రదాత, జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ పుట్టినరోజు వేడుకలను బీర్‌పూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో నాయకులు కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ ఘనమైన వేడుకల్లో కేడీసీసీ జిల్లా డైరెక్టర్ ముప్పాళ రాంచందర్ రావు, కోల్వాయి పాక్స్ చైర్మన్ పోల్సాని నవీన్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారపాక రమేష్, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ చైర్మన్ చీర్నేని శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే మండల సర్పంచులు ఎలమట్ల హరీష్, ఎడ్ల సృజన-సుశిన్, శ్రీలత - రాజు కుమార్, రంగు లక్ష్మణ్, కొనపెల్లి శేఖర్, చల్ల వినోద - లక్ష్మణ్, చిక్రం మారుతి, బనుక సతీష్, బోడ సాగర్, మసీద్ తిరుపతి, మాజీ సర్పంచులు అజ్మీర ప్రభాకర్, చుంచు నరేందర్, శీలం లింగన్న పాల్గొనగా, ముఖ్య నాయకులు ఆడేపు రవి కుమార్, ఉప సర్పంచ్ ఎనగంటి జితేందర్, మైదాం గంగారాజం, సంకుటాల జలపతి, చెటిపెల్లి సత్యనారాయణ, బోడ నరేష్, నారపాక అనిల్, పూదూరు గంగరవి, మామిడిపెల్లి రవిచంద్ర, నూర వినోద్, మామిడిపెల్లి రంజిత్, బూస సత్తన్న, పూదూరు మహేష్, అల్లె శ్రీధర్ తదితరులతో పాటు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## చంపత్ రాజీనామాకు ఆమోదం

రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రాల రాజీనామాలను ఆమోదించినట్టు ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి తెలిపారు. సోమవారం జరిగిన ట్రస్ట్ కీలక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ఆయన వెల్లడించారు. ట్రస్ట్ రాజ్యాంగం ప్రకారం రాజీనామా సమర్పించిన క్షణంలోనే దాన్ని ఆమోదించినట్టు పరిగణిస్తారు. చంపత్ రాయ్ స్థానంలో తాత్కాలిక కార్యదర్శిగా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి కృష్ణ మోహన్‌ను ట్రస్ట్ నియమించింది.

# 8న భద్రాచలంలో 'సోషల్ మీడియా ప్రభావం'పై రాష్ట్రస్థాయి సెమినార్: ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి హాజరు

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) జూలై 06**




డిజిటల్ యుగంలో సోషల్ మీడియా సమాజంపై చూపుతున్న ప్రభావం, బాధ్యతాయుత జర్నలిజం, మరియు ప్రజాస్వామ్య పరిరక్షణలో మీడియా పాత్ర వంటి అంశాలపై విస్తృత చర్చ జరిపేందుకు భద్రాచలంలో రాష్ట్రస్థాయి సెమినార్ నిర్వహించనున్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఖఔజీ-×జీఖ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 8 న ఉదయం 10 గంటలకు భద్రాచలంలోని అక్షయ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. టేకులపల్లి ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన టీయూడబ్ల్యూజే (ఐజేయు) మండల సర్వసభ్య సమావేశంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు ఎండి వై పాషా, డివిజన్ సహాయ కార్యదర్శి రాయల ప్రశాంత్, డివిజన్ కార్యవర్గ సభ్యులు తవుడోజు సందీప్, తోటకూరి జయంత్, గుడిపూడి నరేష్‌లు పాల్గొని ఈ సెమినార్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రతి వ్యక్తి జీవితంలో ఒక భాగంగా మారిన నేపథ్యంలో.. దాని సానుకూల, ప్రతికూల ప్రభావాలు, సమాచార ప్రసారంలో వేగం, ఫేక్ న్యూస్ (తప్పుడు ప్రచారం)ను గుర్తించే విధానాలు, ప్రజల్లో మీడియా విజ్ఞానాన్ని పెంపొందించడం మరియు డిజిటల్ మీడియా భవిష్యత్తువంటిసమకాలీనఅంశాలపై ఈ సదస్సులో నిపుణులు తమ అమూల్యమైన అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి హాజరుకానుండగా, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు బి. వి. రమణారెడ్డితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా రానున్నారు. అలాగే జిల్లా కలెక్టర్ అంకిత్, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, డీఎస్పీ అరుణ్ కుమార్, ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేందర్ కుమార్, హెచ్ఆర్ జీఎం శ్యామ్ కిరణ్ తదితర ఉన్నతాధికారులు, ప్రముఖులు పాల్గొని ప్రసంగించనున్నారు. ఈ కీలక సెమినార్ ముగిసిన అనంతరం, టీయూడబ్ల్యూజే (ఐజేయు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీతో పాటు నూతన డివిజన్ కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు. జర్నలిజంలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు, సమాజంలో మీడియా పాత్రను బలోపేతం చేసేందుకు దోహదపడే ఈ రాష్ట్రస్థాయి సదస్సుకు జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, మరియు డిజిటల్ మీడియా రంగాలకు చెందిన జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు అందరూ పెద్ద సంఖ్యలో హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టేకులపల్లి మండల సర్వసభ్య సమావేశం వేదికగా యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. యూనియన్ సభ్యులు సిహెచ్ సర్వేష్, బి దస్రు, పొనకంటి ఉపేందర్ రావు మోహన్ బాబు, రామ్ చందర్, శ్రీకాంత్, వెంకటేష్, సరిలాల్, సాయి కృష్ణ, రాజేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

# నేతకాని మహర్ సేవా సంఘం జిల్లా ఇన్చార్జీల నియామకం

- సంస్థను క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని నిర్ణయం : దుర్గం స్వామి
- మంచిర్యాల జిల్లా ఇన్చార్జీగా శ్రీకాంత్
- మహిళా ఇన్చార్జీగా రామటెంకి విజయ
- పెద్దపల్లి జిల్లా మహిళా ఇన్చార్జీగా దుర్గం ప్రమీల



**(వి వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) జూలై 6**

తెలంగాణ నేతకాని మహర్ సేవా సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర కమిటీ పునర్వ్యవస్థీకరణ, జిల్లా స్థాయిలో ఇన్చార్జీల నియామకంపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ?ఈ కార్యక్రమానికి సమతా సైనిక దళ్ ఉత్తర తెలంగాణ ఇన్చార్జ్, సమత ఫౌండేషన్ చైర్మన్ దుర్గం నగేష్, రాష్ట్ర నాయకులు జనగామ తిరుపతి, గట్టు భానేష్, దుర్గం రాజయ్య, కిరణ్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలని, నిరంతరం క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడి సేవలు అందించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో మంచిర్యాల జిల్లా ఇన్చార్జీగా శ్రీకాంత్, మహిళా ఇన్చార్జీగా రామటెంకి విజయ, మరియు పెద్దపల్లి జిల్లా మహిళా ఇన్చార్జీగా దుర్గం ప్రమీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఇన్చార్జీలకు రాష్ట్ర కమిటీ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నేతకాని కుల అభివృద్ధి, జాతి ప్రయోజనాల పరిరక్షణ కోసం శక్యంచన లేకుండా పనిచేస్తామని, నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి నుండి ప్రజలను ఏకం చేస్తూ సంస్థ బలోపేతానికి కృషి చేస్తామని,పునరుద్ఘాటించారు ఈ కార్యక్రమంలో జాడి అనిత, జాడి ప్రమీల, దుర్గం మహేందర్, అగిడి భీమరాజు, కొండగోర్ల మహేష్, కామెర గణేష్, జమ్మిడి రాజేష్, తదితర ముఖ్య నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## నిఘా నేత్రాలు రక్షణ కవచంలా పనిచేస్తాయి

- జగిత్యాల డిఎస్పి కె. పురుషోత్తం రెడ్డి
- రాజారాం పల్లి లో సీసీ కెమెరాల ప్రారంభం

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు ఎండపల్లి) జులై 06:**

నిఘా నేత్రాలు ( సీసీ కెమెరాలు) గ్రామాలకు పోలీసు రక్షణ కవచంలా పనిచేస్తాయని అన్ని గ్రామాల్లో సిసి కెమెరాలను అమర్చుకోవాలని జగిత్యాల డిఎస్పి కె.పురుషోత్తం రెడ్డి పేర్కొన్నారు. ఎండపల్లి మండలం లోని రాజారాం పల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డిఎస్పి హాజరవగా, గ్రామ సర్పంచ్ సంగ రమేష్ యాదవ్ ఘనంగా స్వాగతం పలికారు. సీసీ కెమెరాల ప్రారంభోత్సవం అనంతరం డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నేరాల నియంత్రణకు, కేసులు చేదించడంలో పోలీసులకు నిఘా నేత్రాలు ( సీసీ కెమెరాలు) ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. రాజారాం పల్లిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం హర్షనీయమని, గ్రామాల్లో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు తోడ్పడాలని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ యాదవ్ ను,గ్రామానికి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహాయ, సహకారాలు అందించిన వారందరినీ డీఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సిఐ రాం నర్సింహారెడ్డి, వెల్గటూర్ ఎస్సై పి. ఉదయ్ కుమార్, గొల్లపల్లి ఎస్సై ఎం. కృష్ణ సాగర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ మేరుగు జానీ,వార్డు సభ్యులు,యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జులై 06(ప్రజాతీర్పు ):**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనేపరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, పాల్గొన్నారు.



## ప్రైవేట్ కార్పోరేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని నియంత్రించాలి

- వినతిపత్రం అందజేస్తున్న వరంగల్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్

**నర్సంపేట జూలై 6 (ప్రజా తీర్పు)**

వరంగల్ జిల్లా నర్సంపేటలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ లో ప్రైవేటు పాఠశాలలో విధ్యార్ధులకు వసతులు కల్పించాలని, ఫీజుల వసూళ్లు నియంత్రించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్జీఓ) నేషనల్ చైర్మన్ అయిలినేని శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు ఎన్ హెచ్ ఆర్ సి (ఎన్జీఓ) ప్రతినిధుల ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మరియు వరంగల్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ ఆర్డీఓ ఉమారాణి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు డి ఎఫ్ ఆర్ సి సమావేశమై 2026-27 విద్యా సంవత్సరం ఫీజుల నిర్ధారణ చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో అకౌంట్ ఆడిట్ మరియు సొసైటీ టెస్ట్ ల ఆడిట్లను ఆర్డీవో స్థాయి జుడిషియల్ అధికారుల ద్వారా చేయించాలని అన్నారు. డి ఎఫ్ ఆర్ సి సమావేశ అనంతరం పాఠశాలల ఫీజుల వివరాలను పత్రిక, మీడియా ముఖంగా ప్రకటించాలని పాఠశాలల ఫీజు రసీదులలో విద్యాశాఖ రిజిస్ట్రేషన్ నెంబర్ సొసైటీ ట్రస్ట్ రిజిస్ట్రేషన్ నెంబర్ మరియు పాఠశాలల్లో కల్పించే సేవలను బట్టి ఫీజుల వివరాలను ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 25% సీట్లను వెనుకబడిన తరగతుల వారికి కేటాయించాలని అన్నారు. పాఠశాలల భవన నిర్మాణ రక్షణ చర్యలు, క్రీడా ప్రాంగణం మరియు ప్రయోగశాలలు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అమలు అయ్యే విధంగా డివిజన్ మరియు మండల విద్యాశాఖ అధికారులు పేరెంట్ కమిటీలు మరియు జిల్లా విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో జరగాలని అన్నారు, అంతే కాకుండా మోటార్ వెహికల్ చట్టం ప్రకారం స్కూల్ బస్సుల ఫిట్ నెస్ వాటి వివరాలు పేరెంట్ కమిటీలకు వివరించాలని అన్నారు. అలాగే స్కూల్ యాజమాన్యాలు తమ తమ పాఠశాలల యూనిఫామ్, స్టేషనరీ, సిలబస్ పుస్తకాలు యాజమాన్యం లేదా వారి అనుచరుల పర్యవేక్షణలో విక్రయిస్తే పాఠశాల అనుమతిని రద్దు చేస్తూ ఆస్తులను పూర్తిగా జప్తు చేసి ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం 1982 మరియు దాని నియమాలు 1993 పాఠశాల విద్యా నియంత్రణ మరియు పర్యవేక్షణ కమిషన్ (సవరణ) చట్టం 2019 విద్యా హక్కు చట్టం 2009 వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం పాఠశాలలకు సరైన ఖాతాలను నిర్వహించాలని మరియు అన్ని ఫీజుల చెల్లింపులకు అన్ని వివరాలతో కూడిన రసీదులు జారీ చేయాలని అన్నారు. అధిక ఫీజుల చెల్లింపు వివాదాల పరిష్కారానికి విద్యాశాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సహకార శాఖ ద్వారా ఆడిట్ ప్రతి సంవత్సరం ప్రైవేటు మరియు కార్పొరేట్ స్కూల్స్ లో నిర్వహించాలని టీచర్స్ మరియు పేరెంట్స్ మీటింగ్ ప్రతి నెలలో విధిగా ఒకరోజు నిర్వహించాలని ఇందులో విద్యార్థుల చదువులపై సమీక్ష జరిపించాలని చదువులో కొంత వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక దృష్టితో వారు చదువుల పట్ల ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని అన్నారు. ముఖ్యంగా పాఠ్యపుస్తకాలు విద్యార్థుల యూనిఫామ్ లు తల్లిదండ్రులు కొనుగోలు చేసుకోవాలని చెప్పాలని అన్నారు. పుస్తకాలు, యూనిఫామ్ ల ద్వారా ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా పుస్తకాలు, యూనిఫామ్ లను వ్యాపారంగా మార్చి లబ్ధి పొందుతున్నారని దీనిపట్ల జిల్లా కలెక్టర్ తో పాటు విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డ్యాగల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ మండల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ మద్దెల శ్యాం కుమార్, నర్సంపేట టౌన్ సెక్రటరీ గాండ్ల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి.. బాబూ జగ్జీవన్ రామ్

- సామాజిక న్యాయం, సాధికారత .. బాబూ జగ్జీవన్ రామ్ ధ్యేయం
- వికృర్తి లక్ష్మీనారాయణ ప్రధానోపాధ్యాయుడు



**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) జులై 6 :**

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి, సామాజిక న్యాయం, సాధికారతకై కృషిచేసిన బాబు జగ్జీవన్ రామ్ 40వ, వర్ధంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల న్యూ అర్బన్ కాలనీ వేములవాడలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వికృర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ" భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలోనూ, అనంతర కాలంలో దేశ నిర్మాణంలోనూ కీలక పాత్ర పోషించిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ అని,బాబూజీ 1908 ఏప్రిల్ 5న బీహార్ లోని చాంద్వా గ్రామంలో జన్మించారని, అణగారిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక సమానత్వానికి తన జీవితాన్ని అంకితం చేశారని, జగ్జీవన్ రామ్ చిన్నతనంలోనే తీవ్రమైన కుల వివక్షను ఎదుర్కొన్నారని, ఆటంకాలు దాటుకుని అర్రా టౌన్ స్కూలు నుండి మెట్రిక్యులేషన్ పూర్తి చేశారని, పండిట్ మదన్ మోహన్ మాలవ్య స్ఫూర్తితో బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్ సైన్స్ పూర్తి చేసి, కలకత్తా విశ్వవిద్యాలయం నుండి బిఎస్సి పట్టా పొందారని, విద్యార్థి దశలోనే కార్మికులను సంఘటితం చేసి హక్కుల కోసం పోరాడారని, 1935లో అంటరానితనం నిర్మూలనకు మరియు దళితుల హక్కుల కోసం" ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్" ను స్థాపించారని, 1937లో బీహార్ శాసనసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, 1936 నుండి 1986 వరకు దాదాపు 50 సంవత్సరాల పాటు నిరంతరాయంగా పార్లమెంటు సభ్యుడుగా (మొదటి సార్వత్రిక ఎన్నికల నుండి వరుసగా 8సార్లు లోకసభకు) పనిచేసిన అరుదైన ప్రపంచ రికార్డు ఆయన సొంతం అని, భారత ప్రభుత్వంలో అత్యధిక కాలం ,(31 సంవత్సరాలకు పైగా) కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేసిన రికార్డు బాబూ జగ్జీవన్ రామ్ కే దక్కుతుందని, కార్మిక శాఖ మంత్రిగా కార్మిక సంక్షేమం కోసం అనేక చట్టాలు, ఉద్యోగుల భవిష్య నిధి రూపకల్పన చేశారని, రైల్వే శాఖ మంత్రిగా మొట్టమొదటిసారిగా రైల్వే బడ్జెట్ ను ప్రవేశపెట్టారని, ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా 1974 కరువు సమయంలో ఆహార సంక్షేమాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని, హరిత విప్లవానికి బాటలు పరిచారని, 1971 నాటి ఇండో-పాక్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా వ్యవహరించి, బంగ్లాదేశ్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారని, జనతా పార్టీ ప్రభుత్వంలో 1979 నుండి 1980 వరకు భారతదేశానికి ఉప ప్రధానిగా సేవలందించారని, పేదలు, అణగారిన వర్గాల సాధికారతే తన జీవిత ధ్యేయంగా భావించిన బాబూజీ 1986 జూలై 6న తుది శ్వాస విడిచారని, ఆధునిక భారతదేశ నిర్మాతల్లో ఒకరిగా, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి గా చరిత్రలో ఆయన పేరు సువర్ణాక్షరాలతో లిఖించబడిందని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారద మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

**నర్సంపేట జూలై 6 ప్రజా తీర్పు**

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, గొప్ప జాతీయవాది, భారతదేశ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా నేడు నర్సంపేట భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయత, భారతదేశ అఖండత కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకోవాలని, వారి స్ఫూర్తితో సమాజ సేవకు, దేశాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాల సాధనకే కట్టుబడి పనిచేస్తుందని, దేశ సమగ్రత, అభివృద్ధి, ప్రజాసేవే పార్టీ ప్రధాన లక్ష్యాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ భారతీయ జనతా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ కి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహా రాములు, బిజెపి ఫ్లోర్ లీడర్ జూలూరు రోజారాణి, నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, సీనియర్ నాయకులు కూనమళ్ళ పృద్విరాజ్, దుగ్యాల సమ్మయ్య,పొనుగోటి రవీంద్రచారి, రాజు,బీజేవైఎం జిల్లా నాయకులు అచ్చ దయాకర్, అన్వేష్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్ర బాబు, ఆడెపు చంద్రశేఖర్, ముత్యాల శ్రీనివాస్, రాజు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.




## ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ.. ఫోర్జరీ సంతకాలతో సాదా బైనామాలపై విచారణ కోరిన బాధితులు

**మంథని, జూలై-06 (ప్రజాతీర్పు)**

ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించే ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలిస్తున్నట్లు మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహించబడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా నిలుస్తోందని దరఖాస్తుదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేపట్టిన సాదా బైనామాల ప్రక్రియలో పట్టాదారుల ఫోర్జరీ సంతకాలతో దరఖాస్తులు సమర్పిస్తున్న ఘటనలపై కచ్చితంగా విచారణ జరిపి అసలు పట్టాదారులకు న్యాయం చేయాలని ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. ఈ సందర్భంగా మంథని మండలం బిట్టుపల్లి, జిల్లెల్లపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 56లో ఉన్న 3 ఎకరాల 3 గుంటల భూమికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో సాదా బైనామా దరఖాస్తులు సమర్పించారని, వాటిని వెంటనే నిలిపివేసి సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ మహావాది సరోజినీ దేవి కుమారుడు సతీష్ కుమార్ ప్రజావాణిలో ఆధారాలతో కూడిన దరఖాస్తు సమర్పించారు. అలాగే బిట్టుపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 68/1లోని 5 ఎకరాల 17 గుంటలు, సర్వే నంబర్ 68/2లోని 4 గుంటల భూమికి సంబంధించిన అన్ని రకాల ఆధారాలను కూడా అధికారులకు సమర్పించినట్లు సతీష్ కుమార్ తెలిపారు. ఫోర్జరీ సంతకాలతో సమర్పించిన దరఖాస్తులపై సమగ్ర విచారణ జరిపి అసలు భూ యజమానులకు న్యాయం చేయాలని ఆయన ప్రజావాణి ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.



## గురుకులాలపై పెరుగుతున్న నమ్మకం.. స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థులు.. తల్లిదండ్రుల భారీ స్పందన

**మంథని, జూలై-06 (ప్రజాతీర్పు)**

పెద్దపల్లి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల బాలురు మంథనిలో సోమవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరై గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసాన్ని చాటారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎడ్యుకేషనల్ పేరెంట్స్ అసోసియేషన్ (టిఇపిఏ)వ్యవస్థాపకుడు దార మధు మాట్లాడుతూ, స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, మెరిట్ ఆధారంగా నిర్వహించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుండటంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తోందని పేర్కొన్నారు. నాణ్యమైన విద్య, పోషకాహారం, సురక్షిత వసతి, ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో పిల్లలను గురుకులాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు అధిక ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిపిఏ ల జిల్లా ఉపాధ్యక్షులు సుంచు మల్లేశం, పేరెంట్స్ బందెల రాజశేఖర్, కల్వల రమేష్, కోమటికుంట సతీష్, రాజు, తాండ్ర రమేష్ పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- రేపటిలోగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 100 శాతం పూర్తి చేయాలి

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 6**




ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ (ఐ.డీ.ఓ.సీ) నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూలి గ్రామీణ ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయిందని, రాష్ట్రవ్యాప్తంగా రేపటిలోగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్లకు వెళ్లిన సమయంలో తాళం వేసి ఉంటే వాటిని 'అబ్సెంట్'గా నమోదు చేయాలని, అవసరమైతే తర్వాత మరోసారి సందర్శించి ఫారాలను అందజేయాలని సూచించారు. పంపిణీ చేసిన ప్రతి ఎన్యుమరేషన్ ఫారాన్ని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తిరిగి సేకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్రవ్యాప్తంగా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. తప్పుడు సమాచారం అందిస్తే ౖా ౣష్ ౦వష్ౖఅశీఅ 31 ప్రకారం చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాన్ని ఎలా పూరించాలో వివరించడంలో ఇబ్బంది పడుతున్న బీఎల్‌వోలకు సూపర్‌వైజర్లు సహకరించాలని, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌వోలు) సూపర్‌వైజర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన చోట అనుభవం ఉన్న వాలంటీర్లను నియమించి బీఎల్‌వోలకు సహకారం అందించాలని తెలిపారు. ప్రతి ఓటరికి ఒక ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేసి, పూరించిన ఫారాన్ని మాత్రమే తిరిగి తీసుకోవాలని, రెండు ఫారాలను ఒకేసారి తిరిగి తీసుకుంటున్నారనే వార్తలు వస్తున్నాయని, అలాంటి విధానం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుసరించరాదని స్పష్టం చేశారు. పూరించిన ఎన్యుమరేషన్ ఫారాలపై తప్పనిసరిగా ఓటర్ల సంతకాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్‌వోలు మాత్రమే పంపిణీ చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులు లేదా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) ఫారాలను పంపిణీ చేయరాదని స్పష్టం చేశారు. అయితే ఓటర్ల చిరునామాలను గుర్తించడంలో మాత్రమే బీఎల్‌ఏలు బీఎల్‌వోలకు సహకరించవచ్చని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశించిన గడువుల్లో పూర్తి చేయాలని, అదే సమయంలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ప్రక్రియను కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 98.4 శాతం పూర్తయిందన్నారు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి హరి సింగ్, డిఆర్వో ప్రేమ్ రాజ్, సూర్యాపేట, కోదాడ, హుజూర్నగర్ వేణు మాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసు లు, తహసిల్దార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఎల్‌ఏలకు దిశానిర్దేశం చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

**నర్సంపేట జులై 6 ప్రజా తీర్పు**

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ( ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని పకడ్బందీగా పారదర్శకంగా పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేయాలనీ బీఎల్‌ఏలకు సూచించిన నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి పెండెం శ్రీలక్ష్మీరామానంద్ నేడు సోమవారం నాడు 25వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై వార్డు ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాన్ని అందిస్తూ బీఎల్‌ఏలకు మార్గనిర్దేశం చేశారు.. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీరామానంద్ గారు మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాలను నిబంధనలకు అనుగుణంగా ఖచ్చితంగా పూర్తి చేయడం, ఓటర్ల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయడం, అవసరమైన సవరణలు చేయడం, ప్రతి అర్హత కలిగిన ఓటరికి పూర్తి సహకారం అందించడం వంటి అంశాలపై బీఎల్‌ఏలకు సూచనలు చేశారు, అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పారదర్శకంగా పూర్తి చేయాలని ప్రతి ఓటరు హక్కు పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్ కిసరి వెంకటేశ్వర్లు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి రమేష్, బీఎల్ఓ చింతల మౌనిక, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిసరి నరేందర్, సిలువేరు కిరణ్, కొలువుల వెంకటేశ్వర్లు, సిలువేరు రవీందర్, చింతల కార్తీక్ రెడ్డి, ఎర్రబెల్లి రమేష్, కీసరి రాజీవ్, గుడికందుల సదానందం, కొలువుల గోపి, కాటబోయిన సాంబయ్య, మెరుగు కిరణ్, మొట్ల లావణ్య, ముద్రబోయిన రాజు, కాట అఖిల్, స్వామిశెట్టి శేఖర్, కాట రాహుల్, నల్లగొండ వంశీ, కొలువుల ఎల్లయ్య, కొలువుల స్వామి, గుండు రవిరాజ్, బన్నే గణపతి, గుడికందుల శీను, అపరాధపు సుమలత, అందె వినోద, తదితరులు పాల్గొన్నారు




## ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,జులై 06(ప్రజాతీర్పు ):**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యుమరేషన్ ఫాం ల పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శనరెడ్డిఅధికారులను ఆదేశించారు.సోమవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ, డిజిటలైజేషన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గడువులోగా ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫాం లు అందివ్వాలని అన్నారు. బిఎల్ఓ లు మాత్రమే ఫాంలు పంపిణీ చేయాలని, బిఎల్ఎ లు గానీ, ఇతర రాజకీయ పార్టీల వారికి గానీ ఎన్యుమరేషన్ ఫాం లు పంపిణీ చేసే అధికారం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికి అవసరమైతే అదనపు హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎప్పటికప్పుడు వివిధ మీడియా మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. వీసీలో భాగంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎన్యుమరేషన్ ఫాంల పంపిణీ ప్రక్రియ పూర్తయిందన్నారు. అన్ని నియమాలు పాటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు.ఈ వీసీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై అప్రమత్తంగా ఉండండి

- ఓటర్లకు అవగాహన కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- ఎస్ ఐ ఆర్, బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ పై అవగాహన సదస్సు

**పటాన్ చేరు జూలై 06 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అంశంలో ఓటర్లకు అవగాహన కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారని.. అర్హులైన ఓటరు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు బిఆర్ఎస్ పార్టీ తరఫున నియమించబడిన బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి.. అర్హులైన ప్రతి ఓటు ఎస్ఐఆర్లో నమోదు చేయించాలని ఆయన సూచించారు. ఎస్ఐఆర్, బిఆర్ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ అంశాలపై బి ఎల్ ఏ లకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 12 న పటాన్చెరు లోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు హరీష్ రావు ముఖ్య అతిథిగా అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు సోమవారం ఉదయం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు మినీ ఇండియా గా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడం మూలంగా ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు దేశంలోని 28 రాష్ట్రాల ప్రజలు నియోజకవర్గంలో నివాసం ఏర్పరచుకొని తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారని వీరి ఓటు హక్కు అంశం ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం నియమించిన బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో ఆశించిన మేరకు పనిచేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు బిఆర్ఎస్ తరపున నియమించబడిన బూతు లెవల్ ఏజెంట్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఓటరుకి ఎస్ఐఆర్ పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి తమ వివరాలు నమోదు చేయించుకునేలా కృషి చేయాలని సూచించారు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో బిఆర్ఎస్ ఓట్లను తొలగించాలన్న కుట్రతో పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల జరిగిన పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నియోజకవర్గంలో 70 వేల ఓట్లు తొలగించి.. ఆమెను ఓడించారని గుర్తు చేశారు పటాన్చెరు నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని తొమ్మిది డివిజన్లో ఉన్నాయని.. రాబోయే బల్దియా ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయాలంటే ప్రతి ఓటును రక్షించుకోవాల్సిన ఆవశ్యకత కార్యకర్తలపై ఉందని తెలిపారు. రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్లకు స్థానికంగానే ఓటు ఉంచుకునేలా సూచించాలని కోరారు. ఈ అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 12వ తేదీన పటాన్చెరులో మాజీ మంత్రి హరీష్ రావు నేతృత్వంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బిఎల్ఏలు భారీ సంఖ్యలో కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే జిఎంఆర్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## విద్యారంగ సమస్యలు పరిష్కారానికై జూలై 10నరాష్ట్ర వ్యాప్త, విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

ఏఐ ఎఫ్ డి ఎస్

**నర్సంపేట జూలై 6 ప్రజా తీర్పు**

నల్లబెల్లి మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య (. ఏ ఐ ఎఫ్ డి ఎస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు మార్త నాగరాజు మాట్లాడుతూ, మాట్లాడుతూ.

రాష్ట్రంలో 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలనే ఆలోచనను మానుకోవాలి.విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్,పాఠ్యపుస్తకాలు అందించాలి. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి, అక్షయ పాత్ర, ఇస్కాన్, మన్నా సంస్థలకు కాకుండా మహిళా సంఘాలకు అప్పగించాలి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యావ్యాపారాన్ని అరికట్టి, ఫీజు నియంత్రణ చట్టం చేయాలి. ఖాళీగా ఉన్న టీచర్, .ఎం ఈ ఓ. డి ఈ ఓ. లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలి. పెండింగ్ స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేసి జి.ఓ నెం: 7,8,9 లను రద్దు చేయాలి. ఇంటర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే ప్రారంభించి, నిధులు కేటాయించాలి. అద్దె భవనాలలో నడుస్తున్న పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలునిర్మించాలి. ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్లు ఏర్పాటు చేసి అధునాతన భవనాలను నిర్మించాలి. విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి, బడి బస్సులు నడపాలి. ఉచిత బస్పస్లు ఇవ్వాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి.ప్రతి పాఠశాలకు కరెంట్, ఇంటర్నెట్, త్రాగునీరు, వంటషెడ్లు, మరుగుదొడ్లు సౌకర్యాన్ని కల్పించాలి. విద్యాసంస్థలలో ర్యాగింగ్ నిరోధక, డ్రగ్స్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలి. ఐ సి సి. కమిటీలు నియమించాలి. విద్యాహక్కు చట్టం అమలు చేసి, పేద విద్యార్థులకు 25% ఉచిత ప్రవేశాలు కల్పించాలి. రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి. కాంగ్రెస్ విద్యారంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసి, 5 లక్షల విద్యా భరోసా కార్డులు, ఉచిత లాప్ ట్యాప?్న అందించాలి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో విచ్చలవిడిగా తెరిచిన పుస్తకాలు, యూనిఫామ్, నోట్బుక్ విక్రయ కేంద్రాలను మూసివేయాలి. ఎన్ ఈ పి . 2020 తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మాణం చేయాలి. ఈ కార్యక్రమంలో శ్రీ కొప్పుల శ్రీకాంత్, బన్నుక సంతోష్, రాకేష్, అజయ్ పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించిన తహసిల్దార్

**ఖానాపూర్, జూలై 06, ప్రజా తీర్పు ప్రతినిధి:**



ఖా నా పూ ర్ మండలంలోని మంగళ వారి పేట లోని వేప చెట్టు తండా గొల్లగూడెం తండా మంగళ వారి పేట పరిధిలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించడం జరిగినది. బి ఎల్ ఓ లకు ఎనిమరేషన్ ఫారం నింపటంలో మరియు కట్టి ఫారం ను బిఎల్ఓ ఆప్ లో అప్లోడ్ చేయడంలో తగు సూచనలను జారీ చేయడం జరిగినది. మరియు బుధరావుపేటలోని ఐదు పోలింగ్ కేంద్రాల లో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను కూడా పరిశీలించడం జరిగినది ఇచ్చట కూడా బిఎల్ఓ లకు ఎస్ఐఆర్ ఫారం నింపటం మరియు అప్లోడ్ చేయడం పై అవగాహన కల్పించడం జరిగినది. అయితే ఈ ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు ఇంకా గడువు 14 రోజులు ఉంది కావున ఒక ప్రణాళిక ప్రకారంగా ఓటర్ల నుండి ఎనిమరేషన్ ఫారంలను అనగా నింపిన ఎనమరేషన్ ఫారంలను తీసుకొని వాటిని బిఎల్ఓ ఆప్ లో అప్లోడ్ చేయాలి. ఒకవేళ ఎ న్యూమరేషన్ ఫారం నింపటంలో ఓటర్లు ఏదైనా ఇబ్బందులకు గురి అయితే వారికి అట్టి ఫారం ను నింపటం చేయాలి. మరియు ఎస్ ఐ ఆర్ భాగంగా ఎనుమరేషన్ ఫారం నింపటంలో మరియు వాటిని అప్లోడ్ చేయడంలో సహాయం చేయటానికి గాను జిల్లా కలెక్టర్ ఆదేశంలో మేరకు ఆర్డిఓ నర్సంపేట అదనంగా ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక అధికారిని నియమించడం జరిగింది. వారి యొక్క సేవలను కూడా వినియోగించుకొని ఇట్టి ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం గడువు లోపల పూర్తి చేయాల్సిందిగా అందరూ బిఎల్ఓ లను కోరనైనది.



## రామాలయం పై బీజేపీ పెద్దలు స్పందించాలి

- మీడియా సమావేశంలో మంత్రి పొన్నం

**సిద్దిపేట్ జిల్లా హుస్నాబాద్ జులై 06 ప్రజా తీర్పు**

అయోధ్య రామ మందిరం కోసం ఎంతోమంది విరాళాలు ఇచ్చినప్పటికీ ఇందులో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ బీజేపీ నాయకులు స్పందించడం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని జిల్లెల్లగడ్డ గ్రామంలో కాంగ్రెస్ నాయకుని నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాముని పేరు మీద, అక్షింతలు పేరు మీద ఓట్లు అడిగే బీజేపీ నాయకులను అయోధ్యలో ఓడగొట్టారని, పెద్ద ఎత్తున దొంగతనం చేసి అవినీతికి పాల్పడ్డ వారిపై తెలంగాణ బీజేపీ నేతలు ఎందుకు స్పందించడం లేదన్నారు. మేము రామునికి వ్యతిరేకం కాదు అంటూనే ఇల్లంతకుంట రామాలయంలో ఎంపీగా ఉన్నప్పుడు ప్రారంభించిన భోజన కార్యక్రమం ఇప్పటికీ నడుస్తుండడాన్ని గుర్తు చేశారు. దేవుడి పేరు మీద జరిగిన స్కామ్ ను హిందువులు అందరికీ అవమానకరంగా పొన్నం అభివర్ణించారు. దీనిపై బీజేపీ నేతలు స్పందించాలని, దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు అడగాలన్నారు. అయోధ్యలో రామజన్మభూమి నిర్మాణం జరగాలని శిలాన్యాసం వేసింది రాజీవ్ గాంధీ కాదా అని అన్నారు అని అన్నారు. అయోధ్య రామ మందిరంలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని దీనిని అయోధ్య ప్రజలు ముందుగానే గమనించారన్నారు. ఇప్పటికైనా రాజకీయం చేయకుండా అయోధ్య రామ మందిరంలో జరిగిన అవినీతిపై స్పందించాలన్నారు.

# చాకలి ఐలమ్మ నేషనల్ అవార్డుకు మద్దెల భవాని ఎంపిక

## దళిత-బహుజన హక్కుల సాధనలో విశిష్ట సేవలకు జాతీయ గుర్తింపు

**దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 06**



దళిత, బహుజన, మహిళల హక్కుల సాధన కోసం నిరంతరం ఉద్యమిస్తూ సామాజిక న్యాయం కోసం విశేష సేవలందిస్తున్న సామాజిక ఉద్యమకారిణి మద్దెల భవానికి బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకమైన "చాకలి ఐలమ్మ నేషనల్ అవార్డు --2026" ప్రదానం చేయనున్నట్లు జాతీయ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు ప్రశంసాపత్రాన్ని జారీ చేసింది. దళిత--బహుజన వర్గాల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, మహిళల సాధికారత, సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మద్దెల భవాని ఎన్నో ఉద్యమాలు నిర్వహించారు. సమాజంలో అన్యాయం, వివక్ష, అణచివేతకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారు. ఆమె అందించిన సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ ఈ జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. జూలై 12, 2026న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖుల చేతుల మీదుగా చాకలి ఐలమ్మ నేషనల్ అవార్డును మద్దెల భవానికి ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సాహితీవేత్తలు, సామాజిక ఉద్యమకారులు, ప్రజా ప్రతినిధులు, కళాకారులు, మేధావులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పలువురు దళిత--బహుజన సంఘాల నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు మద్దెల భవానికి అభినందనలు తెలియజేశారు. ఆమెకు లభించిన ఈ జాతీయ పురస్కారం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మద్దెల భవాని మాట్లాడుతూ, "చాకలి ఐలమ్మ నేషనల్ అవార్డు" తన వ్యక్తిగత గౌరవం మాత్రమే కాదని, దళిత--బహుజన హక్కుల కోసం పోరాడుతున్న ప్రతి ఉద్యమకారుడికి దక్కిన గౌరవమని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో సామాజిక న్యాయం, సమానత్వం, మహిళా సాధికారత కోసం తన పోరాటం మరింత ఉత్సాహంతో కొనసాగుతుందని తెలిపారు.

# హైహై హాలండ్.. బైబై బ్రెజిల్

- ప్రిక్వార్టర్స్‌లోనే ఓడిన ఐదుసార్లు చాంపియన్
- అర్లింగ్ డబుల్ ధమాకా
- తొలిసారి క్వార్టర్ ఫైనల్‌కు నార్వే



ఐదుసార్లు వరల్డ్‌కప్ విన్నర్, ఫుట్‌బాల్ ప్రపంచంలోనే మేటి జట్లలో ఒకటి.. కోట్లాది మంది అభిమానులున్న బ్రెజిల్‌కు మళ్లీ నిరాశే. ఆరో ట్రోఫీ వేటలో ఉన్న 'సాంబా' టీమ్ ఈసారి క్వార్టర్ ఫైనల్లో అడుగు పెట్టకుండానే ఇంటిదారి పట్టింది. అత్యంత చెత్త ఆటతో అభిమానులను నిరాశపరుస్తూ.. కన్నీటితో కప్పు నుంచి నిష్క్రమించింది. ఈ ఓటమి బాధతో బ్రెజిల్ సూపర్ స్టార్ నెయ్‌మార్ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు ప్రకటించాడు. ఇంకోవైపు 28 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత మెగా టోర్నీలో రీఎంట్రీ ఇచ్చి.. ఎలాంటి అంచనాలు లేకుండా ఆడుతున్న నార్వే నాకౌట్‌లో తమ దమ్ము చూపెట్టింది. స్టార్ స్ట్రైకర్ అర్లింగ్ హాలండ్ డబుల్ గోల్స్‌తో చెలరేగిన వేళ బ్రెజిల్ హార్ట్ బ్రేక్ చేసి తొలిసారి క్వార్టర్ ఫైనల్ చేరింది. ఫిఫా ప్రపంచకప్‌లోనే అతి పెద్ద సంచలనం. అండర్‌డాగ్ నార్వే.. సాకర్‌లో మేటి జట్టు బ్రెజిల్ పని పట్టింది. న్యూజెర్సీ స్టేడియంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన హోరాహోరీ నాకౌట్ పోరులో 2-1 తేడాతో సాంబా టీమ్‌ను చిత్తు చేసింది. నార్వే స్టార్ స్ట్రైకర్ అర్లింగ్ హాలండ్ సెకండాఫ్‌లో (79, 90వ నిమిషాల్లో) రెండు అద్భుత గోల్స్‌తో విరుచుకుపడి మాజీ చాంపియన్లను ఇంటిదారి పట్టించాడు. బ్రెజిల్ దిగ్గజం నెయ్‌మార్ (90ం10వ ని)కొట్టిన ఏకైక గోల్ ఆ జట్టుకు ఓటమి తప్పించలేకపోయింది. సాకర్ చరిత్రలో టాప్ టీమ్స్‌ను పడగొట్టి.. ఎన్నో అద్భుత విజయాలు సాధించిన బ్రెజిల్.. నార్వే కోటను మాత్రం బద్దలు కొట్టలేకపోతోంది. 1988 నుంచి రెండు వరల్డ్‌కప్స్ సహా ఆ జట్టుతో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఒక్కసారి కూడా నెగ్గలేకపోవడం గమనార్హం. ఇక, తొలిసారి క్వార్టర్ ఫైనల్ చేరిన నార్వే.. ఈ నెల 11న ఇంగ్లండ్‌తో తలపడనుంది.

### సెకండాఫ్‌లో ధమాకా

ఈ మ్యాచ్ తొలి 45 నిమిషాలు గోల్ లేకుండా ముగిసినప్పటికీ డ్రామాకు ఏమాత్రం కొదవ లేదు. ఆట ఆరంభంలోనే నార్వే ఆటగాడు సాండర్ బెర్గ్ బంతిని నెట్‌లోకి పంపినా.. రిఫరీ ఆఫ్‌సైడ్‌గా ప్రకటించడంతో ఆ టీమ్‌కు నిరాశ ఎదురైంది. ఆ తర్వాత బ్రెజిల్‌కు సువర్ణావకాశం లభించింది. బాక్స్ లోపల మాథ్యూస్ కున్హాను నార్వే డిఫెండర్ క్రిస్టోఫర్ అజెర్ కిందపడేయడంతో బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. తన అంతర్జాతీయ కెరీర్‌లో మొదటి పెనాల్టీ కిక్ తీసుకున్న బ్రూనో గిమారెస్ కొట్టిన పేలవ షాట్‌ను నార్వే గోల్‌కీపర్ ఓర్జన్ నైలాండ్ సులభంగా అడ్డుకున్నాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న వినిషియస్ జూనియర్, మార్టిన్ ఒడెగార్డ్ కొట్టిన షాట్లను కూడా తిప్పికొట్టాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ 35 శాతం మాత్రమే బంతిని తన ఆధీనంలో ఉంచుకోగలిగింది. అటు నార్వే బంతినిపై పైచేయి సాధించినా ఫస్టాఫ్‌లో గోల్ కొట్టలేకపోయింది. విరామం తర్వాత బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలోటి వ్యూహాత్మకంగా గాబ్రియేల్ మార్టినెల్లి స్థానంలో సీనియర్ స్టార్ నెయ్‌మార్‌ను మైదానంలోకి దించాడు. తన రాకతో బ్రెజిల్ ఎటాకింగ్‌లో వేగం పెరిగినా నార్వే డిఫెన్స్ గట్టిగా నిలబడింది. ఇంకోవైపు నార్వే ఫార్వర్డ్స్ బ్రెజిల్ డిఫెన్స్‌లోకి చొచ్చుకెళ్లి దాడుల తీవ్ర పెంచారు. ఈ క్రమంలో ఆండ్రియాస్ షెల్డెరప్ ఎడమ వైపు నుంచి అందించిన అద్భుతమైన క్రాస్‌ను అందుకున్న హాలండ్ బ్రెజిల్ డిఫెండర్ గాబ్రియేల్ కంటే ఎత్తుగా ఎగిరి బుల్లెట్ లాంటి హెడర్ గోల్ కొట్టాడు. అక్కడి నుంచి బ్రెజిల్ స్కోరు చేసేందుకు ఎంత ట్రై చేసినా .. నిర్ణీత 90 నిమిషాల్లో నార్వే డిఫెన్స్‌ను బ్రేక్ చేయలేకపోయింది. ఇంకోవైపు ఇంజూరీ టైమ్‌లో షెల్డెరప్ ఇచ్చిన పాస్‌ను హాలండ్ క్లాసిక్ టచ్‌తో గోల్ పోస్ట్ రైట్ కార్నర్‌లోకి పంపి నార్వే ఆధిక్యాన్ని డబుల్ చేశాడు. అప్పటికే బ్రెజిల్ ఆటగాళ్లు, ఫ్యాన్స్ తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. మ్యాచ్ ఆఖరి క్షణాల్లో బ్రెజిల్‌కు మరో పెనాల్టీ లభించింది. దాన్ని నెయ్‌మార్ గోల్‌గా మలిచినా అప్పటికే పూడ్చలేని నష్టం జరిగిపోయింది.

### కప్పు లేకుండానే కథ ముగిసె

మెగా టోర్నీలో అనూహ్య ఓటమి తర్వాత బ్రెజిల్ సూపర్ స్టార్ నెయ్‌మార్ జూనియర్ తన ఇంటర్నేషనల్ కెరీర్‌కు వీడ్కోలు ప్రకటించడం ఆ జట్టు అభిమానుల బాధను రెట్టింపు చేసింది. 2010లో అమెరికా గడ్డపైనే యూఎస్ఏ జట్టుతో ఫ్రెండ్లీ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన దిగ్గజం అదే దేశంలో తన ఆట ముగించాడు. 'వరల్డ్‌కప్ నెగ్గాలన్నది నా కల. దాని కోసంచాలా ప్రయత్నించాను. ఇప్పుడు నా పోరాటం ముగిసింది. ఇక్కడే కెరీర్ ఆరంభించాను.. ఇక్కడే ముగిస్తున్నా' అని నెయ్‌మార్ మ్యాచ్ తర్వాత భావోద్వేగంతో చెప్పాడు. తన 16 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో నెయ్‌మార్ ఈ తరం మేటి ఆటగాళ్లలో ఒకడిగా, బ్రెజిల్ తరపున అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. మైదానంలో మెరుపు వేగంతో కదులుతూ అనుకోని దిశల్లోకి టర్న్ అవుతూ ప్రత్యర్థులను ఆశ్చర్యపరచడం.. బంతిని తన కాలికి అతుక్కున్నట్లుగా డ్రిబ్లింగ్ చేయడం, డిఫెండర్లను ఏమార్చి ముందుకు వెళ్లడంలో అతను దిట్ట. బంతిని పైకి లేపి, డిఫెండర్ల తల మీదుగా పంపే రెయిన్‌బో ఫ్లిక్ వంటి నైపుణ్యాలతో ఎంతో మంది ఫ్యాన్స్‌ను సంపాదించుకున్నాడు.

# ఇలాంటి యాక్షన్ రాలేదు!



'అందరూ 'టాక్సిక్' రిలీజ్ ఇన్నిసార్లు ఎందుకు వాయిదా పడిందనే విషయం గురించి మాట్లాడుతున్నారు. కానీ సినిమా కంటెంట్ ఎంత కొత్తగా ఉందో ఆలోచించడం లేదు. ఇలాంటి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తాయి' అని చెప్పింది కథానాయిక హ్యూమా ఖురేషి. యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలో ఆమె ఓ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ను కన్ఫర్మ్ చేసుకుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో హ్యూమా ఖురేషి సినిమా విశేషాలను పంచుకుంది. ఈ చిత్రంలోని కొన్ని భాగాలను మాత్రమే తాను చూశానని, భారతీయ సినిమాలో ఈ స్థాయిలో యాక్షన్‌ను ఇప్పటివరకూ చూడలేదని ఆమె చెప్పింది. 'ఇలాంటి సినిమాలు ఎప్పుడు రిలీజైనా సంచలనం సృష్టించడం ఖాయం. కంటెంట్‌తో పాటు మేకింగ్, యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకుల్ని అబ్బురపరుస్తాయి.



# ఉవ్వెత్తున ఎగిసే ఉత్తుంగ తరంగం

అగ్ర దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. సోమవారం ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'అణువు అణువును ఉద్రూతలూపే ప్రణయ కల్లోలమే-రోమాంచకం, ఊహకే అందని ఉవ్వెత్తునెగిసే ఉత్తుంగ తరంగమే రోమాంచకం' అంటూ మెలోడియస్ ట్యూన్‌తో ఈ గ్లింప్స్ ఆకట్టుకునేలా ఉంది. వాసుకి వైభవ్ మ్యూజిక్, విజువల్స్ ఈ గ్లింప్స్‌లో ప్రధానాకర్షణగా నిలిచాయి. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలబోసిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ తెలిపారు.



# మున్సిపాలిటీలో కానరాని పరిశుభ్రత

**హుస్నాబాద్ జులై 06 ప్రజా తీర్పు**

హుస్నాబాద్ మున్సిపాలిటీకి జూన్ 5న చెత్త నిర్వహణలో ఉత్తమ మున్సిపాలిటీ గా ఎంపిక కావడం పట్ల అందరూ హర్షించారు, అభినందించారు. కానీ ఇటీవల పరిశుభ్రతలో సమర్థవంతమైన చెత్త నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతుందని పట్టణ ప్రజల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి నిదర్శనమే చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం. చెత్తను లేకుండా చేస్తున్నాం అని చెప్పడం వరకు అన్నట్లుగా మాటల వరకే పరిమితం అవుతున్నారు అని అక్కడ కనిపిస్తున్న చెత్త తెలియజేస్తున్నది. అయితే మున్సిపల్ కమిషనర్ దీనిపై దృష్టి సారించడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను లేకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# జెసిబి తో మురుగు నీటి సరఫరా కాలువల్లో మొక్కల తొలగింపు

**మంథని, జూలై-06 (ప్రజాతీర్పు)**

మంథని మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు గంగాపురిలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వర్షపు నీటి పారుదల సక్రమంగా జరిగేలా మురుగు నీటి సరఫరా కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని జెసిబి సహాయంతో తొలగించారు. వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు సహకరించిన మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌కు 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి--రమేష్ బాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "ప్రజల సమస్యల పరిష్కారమే మా లక్ష్యం.. వార్డు అభివృద్ధే మా ధ్యేయం" అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 06**

సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి గారిని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి గారు ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి గారు తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



# సీనియర్ జర్నలిస్టు ను పరామర్శించిన సిపిఐ నాయకులు

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) జూలై 06**

మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం లోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఆయిలి రాజేశం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయము తెలుసుకొని ఆయన స్వగ్రామమైన కొత్తపల్లి గ్రామాని వెళ్లి పరమశించి మనోధైర్యం ఇచ్చి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కొన్ని నిబంధనలు నియమాలు పాటించాలని సూచించారు, ఆయిలి రాజేశం సమాజంలోని సమస్యలను వార్తల రూపంలో ప్రజలకు చేరవేస్తూ జర్నలిజం రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఆయన అనారోగ్యంతో బాధపడడం చాలా బాధాకరమని గతం లాగా ఆరోగ్యంగా జీవించాలని మళ్లీ జర్నలిస్టుగా కొనసాగాలని సిపిఐ నాయకులు అన్నారు. కొండు బానే ష్ సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి. నరాల ప్రహ్లాద్ సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి. కొండు సాయికుమార్ సిపిఐ చంద్ర పల్లి గ్రామ కార్యదర్శి.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020